


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




వరంగల్ | 06-06-2026 శనివారం | సంపుటి : 11 | సంచిక : 345 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on



* పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాము. తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. కర్ణాటకతో సమ న్వయంతో ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నాం. పనులకు అడ్డుపడకుండా ఉండాలని బీఆర్ ఎస్ నేతలను కోరుతున్నా. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటి వారు. బిఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది, భవిష్యత్తు లేదు. – సిఎం రేవంత్ రెడ్డి


## వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు




### పాలమూరు-రంగారెడ్డి పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం

- ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి
- ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు
- మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు.
- అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకే వారు యత్నించారు
- జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తి
- కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం
- నాపై కోపంతో ఆ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టడం న్యాయమేనా?
- 50 శాతం నిధులు ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులు ఎలా జరుగుతాయి?
- తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

**మహబూబ్ నగర్, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** బీఆర్ ఎస్ పాలనలోనే కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఉమ్మడి మహ బూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం.. రెండోరోజు శుక్రవారం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లా డారు. ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెఃక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ జరగలేదన్నారు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నా. మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్య టన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం. మిగతా 2లో



## హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

### ఇద్దరు గాంధీ ఆసుపత్రికి తరలింపు

గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు అనుమానితులు కూడా విదేశాల నుంచి ఒకే ఫ్లైట్‌లో హైదరాబాద్ వచ్చినట్లు గుర్తించిన అధికారులు

**హైదరాబాద్, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** హైదరాబాద్‌లో ఎబోలా వైరస్ కలకలం రేపుతోంది. అనుమానిత ఎబోలా లక్షణాలతో మరో ఇద్దరు వ్యక్తులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేరారు. దీంతో ఇప్పటివరకు ఈ వైరస్ లక్షణాలతో గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డుకు చేరిన వారి సంఖ్య ముగ్గురికి చేరింది. ఈ రోజు తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులు ఎబోలా లక్షణాలతో జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి వెళ్లారు. వారిని పరిశీలించిన వైద్యులు ప్రాథమిక లక్షణాల ఆధారంగా ఎబోలాగా అనుమానించారు. బాధితులను తక్షణమే మెరుగైన చికిత్స, ప్రత్యేక నిఘా కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా, నిన్ననే మరో వ్యక్తిని కూడా ఇలాంటి లక్షణాలతోనే గాంధీ ఆసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు జరిపిన ప్రాథమిక విచారణలో ఒక కీలక విషయం వెలుగుచూసింది. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు అనుమానితులు కూడా విదేశాల నుంచి ఒకే ఫ్లైట్‌లో హైదరాబాద్ వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ముగ్గురు బాధితులు ఒకే విమానంలో ప్రయాణించారనే విషయం తేలడంతో వైద్య నిపుణులు, ఎయిర్‌పోర్ట్ అధికారులు అప్రమత్తమయ్యారు. సదరు ఫ్లైట్‌లో ప్రయాణించిన మిగతా 2లో

## బీఆర్ఎస్ పాలన వ్యవస్థల్లో వైఫల్యాలు

- రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదు
- బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,సోషల్ మీడియా ఆధునిక సాంకేతికతను వినియోగించాలి
- తెలంగాణ అభివృద్ధికి డబుల్ ఇంజిన్ సర్కార్ అవసరం : తెలంగాణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావు రాంచందర్‌రావు



**మ హ బూబాబాద్, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

## మాటకు కట్టుబడి ఉన్నాం

### జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం : భట్టి

- సొసైటీల లేఖలు సబ్ కమిటీకి రాగానే నిర్ణయం
- ఫోర్త్ సిటీలో 500 ఎకరాల టీజీఐఐసీ స్థలాన్ని కేటాయించే దిశలో వనరుల సమీకరణ కోసం మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంటుంది



**హైదరాబాద్, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఫోర్త్ సిటీలో 500 ఎకరాల టీజీఐఐసీ స్థలాన్ని కేటాయించే దిశలో వనరుల సమీకరణ కోసం ఏర్పడిన మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు కొందరు జర్నలిస్టులు ప్రజాభవన్ లో క్యాబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్ భట్టి విక్రమార్కను కలిశారు. జేఎన్జే హౌజింగ్ సొసైటీ సీఈఓ, డైరెక్టర్లు ఆయనకు విజ్ఞాపన ప్రతిని ఇచ్చారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. సానుకూలంగా స్పందించిన భట్టి, రాజధాని విలేకరులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. జేఎన్జేతో పాటు ఇతర హౌజింగ్ సొసైటీల నుంచి విజ్ఞప్తులు రాగానే, వాటిని జోడించి ఉపసంఘం ఎజెండాలో పెట్టి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కాగా, తమకు పేట్ బషీరాబాద్, నిజంపేటలోని పాత స్థలాలే ఇవ్వాలన్న (జేఎన్జేలోని) ఒకవర్గం డిమాండ్ ను భట్టి తోసిపుచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల దాటి అలా ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పారు.



## అభివృద్ధి అవసరమే.. కానీ ప్రకృతిని కాపాడాలి

- పర్యావరణాన్ని నాశనం చేసే విధంగా ఉండొద్దు : మంత్రి పొన్నం ప్రభాకర్
- భౌగోళికంగా ఎంతో పేరుగాంచిన నికోబార్ ఐలాండ్‌ను అదానీకి అప్పగించే ప్రక్రియ సాగుతోంది

**హైదరాబాద్, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** అభివృద్ధి అవసరమే కానీ, అది పర్యావరణాన్ని నాశనం చేసే విధంగా కాకుండా ప్రకృతిని కాపాడే దిశగా సాగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రకృతి పరంగా, భౌగోళికంగా ఎంతో పేరుగాంచిన నికోబార్ ఐలాండ్‌ను అదానీకి అప్పగించే ప్రక్రియ సాగుతోంది. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో దీన్ని నాశనం చేస్తున్న పరిస్థితులను రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శిస్తున్నారని తెలిపారు. 2లో

## తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయి

- కాపాడటంలో సర్కార్ విఫలం: మాజీ మంత్రి హరీశ్ రావు
- ఎత్తిపోతల పంపుల నిర్వహణలో బీఆర్ఎస్ హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదు
- కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది



**హైదరాబాద్, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని లేఖలో ఆరోపించారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చోటుచేసుకుందని తెలిపారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ 74 శాతం వినియోగిస్తుంటే.. తెలంగాణ 25 శాతానికి పరిమితమైందని లేఖలో తెలిపారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రమాదంలో పడేసిందని మాజీ మంత్రి విమర్శించారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలు సాగునీటి రంగానికి ముప్పుగా మారాయని లేఖలో స్పష్టం చేశారు. మిగతా 2లో


## పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలి

- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం
- వరి కోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్

2

## ఎపిలో బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతి

- ఏపీ అభివృద్ధి చెందితే భారత్ అభివృద్ధి
- దేశ సముద్రపు ఆహార ఎగుమతుల్లో ఏపీ నుంచే కేంద్రానికి దాదాపు 38 శాతం ఆదాయం
- సంవత్సరానికి రూ.28,000 కోట్లకు పైగా సీ-ఫుడ్ ఎగుమతులు ఎపి నుంచే జరుగుతున్నాయి
- బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం
- ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**విశాఖపట్టణం, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** భారతదేశంలో సముద్రపు ఆహారం (సీ-ఫుడ్) ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతి ఏటా 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఏపీ నుంచి ఉత్పత్తి అవుతోందని పేర్కొన్నారు. ఎపిలో బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతికి దోహదపడుతుందని సిఎం అభిప్రాయపడ్డారు. విశాఖలో సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్ ఘనంగా ప్రారంభమైంది. సీఎం చంద్రబాబు నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకినాడ పోర్టును ఆధునికీకరణ చేస్తామని మిగతా 2లో

## కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

- ఆ స్థలాల్లో మహిళలకు వాటా కల్పిస్తాం
- నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఇండ్ల నిర్మాణం
- సొంతింటిపై హక్కుతో ఆర్థిక, సామాజిక భద్రత బలోపేతం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** పేదల జీవనోపాధికి ఏ మాత్రం ఇబ్బంది లేకుండా నియోజక వర్గాన్ని యూనిట్ గా తీసుకొని క్యూర్ పరిధిలో పేదలు నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పదాయ, మధ్యతరగతి వర్గాలు కు లక్ష ఇండ్లు నిర్మించబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలల్లో లక్ష ఇండ్లను నిర్మించి ఆ స్థలములో వారి వాటాకు యజమానిని చేస్తూ పెడింటి ఆడబిడ్డలకు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లకు ఇతర ప్రాంతాలల్లో 2.50 లక్షలు మొత్తం 3.50 లక్షల ఇండ్లకు ఇప్పటికే ప్రరిపాలన పరమైన అనుమతులు ఇవ్వడం జరిగిందని, దీనిని దృష్టిలోపెట్టుకొని అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మిగతా 2లో

## స్పా సెంటర్లపై దాడులు

- 500 మంది పోలీసుల మెరుపు దాడి
- ఉలిక్కిపడ్డ స్పా సెంటర్ల నిర్వాహకులు
- బృందాలుగా ఏర్పడి 113 స్పా సెంటర్లపై ముకుమ్మడిగా తనిఖీలు

**హైదరాబాద్, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** నగరంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పలు స్పా సెంటర్లపై పోలీస్ బృందాలు శుక్రవారం ఒక్కసారిగా దాడులు చేశారు. 500 మంది పోలీసులు బృందాలుగా ఏర్పడి 113 స్పా సెంటర్లపై ముకుమ్మడిగా తనిఖీలు నిర్వహించాయి. పలు స్పా సెంటర్లలో అక్రమాలతోపాటు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులు నిర్ధారించినట్లు తెలుస్తోంది. కస్టమర్లకు సంబంధించిన డేటా రిజిస్టర్‌ను సైతం స్పా సెంటర్ నిర్వాహకులు మెయింటెయిన్ చేయడం లేదని గుర్తించారు. అలాగే స్పా సెంటర్లకు రెంటుకు ఇస్తున్న ఓనర్లను కూడా ఈ సందర్భంగా పోలీసులు విచారించారు.


# వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు

మొదటి పేజీ తరువాయి

కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారు. పాలమూరు–రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారు? మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నాం. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్–నారాయణ



పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేస్తాం. కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నాం. పనులకు అడ్డుపడకుండా ఉండాలని బీఆర్ఎస్ నేతలను కోరుతున్నా. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటివారు. బీఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది.. భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టయినా మొదలుపెట్టి పూర్తి చేసిందా చెప్పాలి. ప్రాణహిత–చేవెళ్ల పేరు, ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసు. ఆయన సొంతంగా మొదలుపెట్టిన ప్రాజెక్టు ఒక్కటీ రాష్ట్రంలో లేదు. కాళేశ్వరం కూలిన తర్వాత చుక్క నీళ్లు తీసుకోకుండా ఎక్కువ వరి ఉత్పత్తి చేశాం''అని రేవంత్ అన్నారు.



## ఎపిలో బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతి

మొదటి పేజీ తరువాయి

కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మత్స్యశాఖ ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15 రోజుల్లో ఇస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 'భారతదేశంలో మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతంగా, రొయ్యల ఉత్పత్తిలో 66 శాతంగా ఉంది. దేశ సముద్రపు ఆహార ఎగుమతుల్లో ఏపీ నుంచే కేంద్రానికి దాదాపు 38 శాతం ఆదాయం వస్తోంది. సంవత్సరానికి రూ.28,000 కోట్లకు పైగా సీ–ఫుడ్ ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులూ అభివృద్ధి చెందుతాయి. ఆక్వా రంగంలో ఏపీ ఆవిష్కరణలు చేస్తే భారతదేశ బ్లూ ఎకానమీ నిస్సందేహంగా ముందుకు సాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే సీ–ఫుడ్ బిజినెస్‌లో భారత్ వాటా కేవలం 5 శాతం మాత్రమే. ఈ రంగంలో దేశానికి పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి. బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్న చోట నాగరికతలు విలసిల్లుతాయి. ఏపీలో గోదావరి, కృష్ణ వంటి జీవనదులు ఉన్నాయి. భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదే' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, చిరాగ్ పాశ్వాన్, రాజీవ్ రంజన్ సింగ్, మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా బాల వీరాంజనేయస్వామి, ఎంపీ బీద మస్తాన్ రావు పాల్గొన్నారు.



## మహబూబ్ నగర్ జిల్లాలో సిఎం రెండో రోజు పర్యటన

**మహబూబ్ నగర్, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వరుసగా రెండోరోజు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధానమైన తాగు, నీటిపారుదల ప్రాజెక్టుల పనులను క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిశీలించారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద పనులు కొనసాగుతున్న ఆయా ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేస్తూ పరిశీలన చేశారు. రెండోరోజు సోమశిల అతిథిగృహం నుంచి బయలుదేరిన ముఖ్యమంత్రి గారు మొదట కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు పంప్ హౌస్ చేరుకున్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన ప్యాకేజీ–3 హెడ్ రెగ్యులేటర్, ప్యాకేజీ–2 నార్లాపూర్ రిజర్వాయర్, ప్యాకేజీ–1 డెలివరీ సిస్టర్న్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగమైన లిఫ్ట్–1 పంప్ హౌస్‌లను సందర్శించారు. ఆ తర్వాత ఎల్లూరు పంప్ హౌస్‌ను పరిశీలించారు. మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి వెంట ఉన్నారు. అక్కడి నుంచి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్) ప్యాకేజీ–3 హెడ్ రెగ్యులేటర్, ప్యాకేజీ–2 నార్లాపూర్ రిజర్వాయర్ పనులను గమనించారు. ఇందులో పథకంలో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ ప్యాకేజీ–1 డెలివరీ సిస్టర్న్‌ల వద్ద ప్రాజెక్టులను పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. పీఆర్ఎల్ఐఎస్ టన్నెల్ లోపలికి 1.5 కి.మీ దూరం ప్రయాణించి పంప్ హౌస్‌ల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి బిజినేపల్లి మండలం కుమ్మెరకు చేరుకుని అక్కడ ప్యాకేజీ–8 స్టేజ్–3 పంప్‌హౌస్, వట్టెం రిజర్వాయర్‌కు సంబంధించిన ప్యాకేజీ – 9, 10, 11 పనులను పరిశీలించారు. తర్వాత హెలికాప్టర్‌లో భూత్పూర్ మండలం కొత్తూరు చేరుకుని ఎత్తిపోతల పథకంలో భాగమైన కరివేన రిజర్వాయర్ ప్యాకేజీ – 14, 15 పనులను చూశారు. ఆ తర్వాత జడ్చర్ల మండలం ఉద్దండాపూర్ చేరుకుని రిజర్వాయర్ పరిధిలోని ప్యాకేజీ 17, 18 పనులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఆయా ప్రాంతాల్లో నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టులకు సంబంధించి ఫోటో ఎగ్జిబిషన్లను ముఖ్యమంత్రి పరిశీలించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తూరు చేరుకుని కరివెన రిజర్వాయర్ పనులను పరిశీలించిన తర్వాత పాలమూరు సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి గారు మీడియా సమావేశంలో మాట్లాడారు.


## తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయి

మొదటి పేజీ తరువాయి

అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను సమర్థంగా కాపాడాలని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

మొదటి పేజీ తరువాయి




మిగతా ప్రయాణికుల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. వారిలో ఎవరికైనా ఇలాంటి లక్షణాలు ఉన్నాయా అనే కోణంలో ట్రాక్ చేస్తున్నారు. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో చేరిన ముగ్గురికీ ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వీరి రక్త నమూనాలను సేకరించి, తుది నిర్ధారణ కోసం పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, అధికారులు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారని వైద్య వర్గాలు తెలిపాయి.

## అభివృద్ధి అవసరమే.. కానీ ప్రకృతిని కాపాడాలి

మొదటి పేజీ తరువాయి

అక్కడ ఉన్న (నావికాదళ స్థావరం) విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వకుండా, పర్యావరణానికి సంబంధించిన వేలాది మొక్కలను, వృక్షాలను కొట్టేస్తూ ప్రకృతికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నారు. పర్యావరణాన్ని సమతుల్యం చేస్తూ సాగే అభివృద్ధి అయితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదు కానీ, కేవలం అదానీని సంతృప్తి పరచడానికే ఒక పూర్తి ఐలాండ్‌ను అప్పగించి, దాన్ని పాడుచేసే ప్రయత్నం జరగడం సరైంది కాదు . నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, రాహుల్ గాంధీ గారి స్ఫూర్తికి, ఆయన చేస్తున్న పోరాటానికి అందరూ సామాజికంగా తమ మద్దతుగా నిలవాలి అని ఈ సందర్భంగా కోరుతున్నాం.

## వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ

**నగరంలో అన్ని దేశాలకు చెందిన ప్రజలు జీవిస్తున్నారు**

**శాసన మండలి, శాసన సభలను సందర్శించిన జపాన్ దేశం, హీరోషిమా రాష్ట్రానికి చెందిన ప్రతినిధుల బృందం**

**రాష్టాన్ని సందర్శించడం శుభపరిణామం**

**శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**



**హైదరాబాద్, జూన్ 5 (ఎంఎస్) :** జపాన్ దేశం , హీరోషిమా రాష్ట్రానికి చెందిన ప్రతినిధుల బృందం నేడు తెలంగాణ శాసన మండలి, శాసన సభలను సందర్శించారు. హీరోషిమా రాష్ట్రం నుండి వచ్చిన ప్రతినిధులకు తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాసన సభ , శాసన మండలి సభలను సందర్శించిన అనంతరం ఛైర్మన్ ఛాంబర్ లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రము భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని నగరంలో అన్ని దేశాలకు చెందిన ప్రజలు జీవిస్తున్నారని , తమ బిజినెస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న శాసన సభ, శాసన మండలి సభ్యులు చట్టాలను రూపొందించడంలో విజయవంతంగా పని చేస్తున్నట్లు ఆయన చెప్పారు. తెలంగాణ రాష్టంలో ఉన్న ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు నిరంతరం ప్రజల్లో ఉంటూ , ప్రజల సమస్యల పరిష్కారం కొరకు పని చేస్తున్నట్లు సుఖేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ తో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆయన వివరించారు. హీరోషిమా ప్రతినిధులు తమ రాష్టాన్ని సందర్శించడం శుభపరిణామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి విప్ లు అద్దంకి దయాకర్ , వెంకట నర్సింగరావు , ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్ , అంజి రెడ్డి , ఎమ్మెల్యేలు టి రామ్మోహన్ రెడ్డి , పాల్వాయి హరీష్ , శాసన మండలి సెక్రెటరీ డా. నర్సింహాచార్యులు , శాసన సభ సెక్రెటరీ ఆర్ . తిరుపతి పాల్గొన్నారు.

## పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలి

**హైదరాబాద్, జూన్ 5 (ఎంఎస్) :** పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదని అరవింద్ వ్యాఖ్యానించారు. వరి కోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్రంపై నెపం మోపడం సరికాదని విమర్శించారు. దొంగ ఇసుక, మొరం రవాణా కోసం ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటే, రైతుల ధాన్యాన్ని తరలించేందుకు మాత్రం కొరత వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని అన్నారు. రాష్ట్రంలో ఎంత పంట ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించకుండా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని అరవింద్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకాక



పోతే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపైనా విమర్శలు చేసిన ఆయన, ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను పరిష్కరించకుండా కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.తెలంగాణ ప్రయోజనాలకు అనుకూలంగా ముఖ్యమంత్రి ఇప్పటివరకు కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని అరవింద్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తుతూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

మొదటి పేజీ తరువాయి

గత ప్రభుత్వం పేదల జీవన పరిస్థితులను, వారి ఉపాధి అవసరాలను ఏ మాత్రం పట్టించుకోకుండా హైదరాబాద్ నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో అరకొరగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించిందని విమర్శించారు. ఇల్లు అనేది పేద కుటుంబానికి ఎంత అవసరమో, వారి జీవనోపాధి కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గత పాలకులు విస్మరించారని అన్నారు. రోజువారీ కూలి పనులు, చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడే పేద కుటుంబాలు నగర శివార్లలో నిర్మించిన ఇళ్లకు వెళ్లలేకపోయాయని, ఉపాధి దూరమవడంతో పాటు పిల్లల విద్య, వైద్య సదుపాయాలు, రవాణా వంటి సమస్యలు ఎదురవడంతో అనేక కుటుంబాలు ఆ ఇళ్లలో నివసించడానికి ఆసక్తి చూపలేదన్నారు. ఫలితంగా ఆ గృహాలు ఖాళీగా, నిరుపయోగంగా మిగిలిపోయాయని పేర్కొన్నారు. ఇలాంటి తప్పిదాలను పునరావృతం చేయకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న



ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టబోతున్నామని, ఈ దిశగా విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమం కోసం వినియోగిస్తూ లక్ష ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోన్నామని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా పేద కుటుంబాల మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సొంత ఇల్లు మహిళ సాధికారతకు, కుటుంబ స్థిరత్వానికి, భవిష్యత్ తరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతుందన్నారు. పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఇండ్ల డిజైన్ లను రూపొందించాలని, ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రెటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు


**సంక్షేమం, పరిపాలనా వ్యవస్థ బలోపేతానికి సేవలు ఉపయోగపడాలి : ఉద్యోగుల ఆకాంక్ష**



**హైదరాబాద్, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ ఎన్జీవోల సంఘం, పాఠశాల విద్యాశాఖ టీజీ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి శ్రీ ఎం.డి. ఫక్రుద్దీన్ అహ్మద్ ఆధ్వర్యంలో నేడు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు ఘన స్వాగత కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్) వెంకటనర్సమ్మ , ప్రాంతీయ సంయుక్త విద్యా సంచాలకులు సోమిరెడ్డి ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ పి. రాజీవ్, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారిఎస్. యాదయ్య ని ఫోరం నాయకులు, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను అభినందిస్తూ, విద్యాశాఖ అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, ఉద్యోగుల సంక్షేమం, పరిపాలనా వ్యవస్థ బలోపేతానికి వారి సేవలు విశేషంగా ఉపయోగపడాలని ఫోరం నాయకులు ఆకాంక్షించారు. అధికారులందరూ విద్యాశాఖ పురోగతికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీఎన్జీవోల సంఘం పాఠశాల విద్యాశాఖ టీజీ సెంట్రల్ ఫోరమ్ ఉపాధ్యక్షులు శ్రీ రాయిశెట్టి అశోక్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ రుగేష్ , పబ్లిసిటీ కార్యదర్శి శ్రీ ఎం.వై. రవి, టిఎన్ జిఓ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ టీజీ సెంట్రల్ ఫోరమ్ జాయింట్ సెక్రటరీలు రమేష్ , సుదర్శన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ, కె. శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి టి. దిలీప్ కుమార్, సాంస్కృతిక కార్యదర్శి షేకర్, అఖీల్ ఉద్దీన్, కార్యవర్గ సభ్యులు యోగి, శివ, మాజీ జాయింట్ సెక్రటరీ ముక్తదార్, అలాగే శ్రీ జగదీష్, పరమేశ్, కలీం, శ్రీ సుధీర్ రెడ్డి, కృష్ణ, అక్బర్, శ్రీ నుమాన్ జుబేర్, సి.ఎన్. రమేష్, శ్రీనివాస్, సుందర్, లక్ష్మీపతి, మిర్జా, వెంకటేష్, రమణ, శివ, రాకేష్, రాజేందర్, పరమేశ్, సీతారాం, సాయి,రాజు, ఐజాజ్, జయరాజ్ పాల్గొన్నారు.


## కల్తీ చాక్లెట్ల తయారీ గుట్టురట్టు

**ఒకరి అరెస్ట్**



**హైద రాబాద్, జూన్ 5 (ఎంఎస్) :** మహానగరంలోని కల్తీ చాక్లెట్ల తయారీ గుట్టును హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ అండ్ సేఫ్టీ టీమ్ రట్టు చేసింది. సీతారాంబాగ్ (పాత మల్లేపల్లి) ప్రాంతంలో విగ్నెట్ ఫుడ్ స్పెషాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై హెచ్ ఫాస్ట్ టీమ్ దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా గడువు ముగిసిన రసాయన పదార్థాలతో కల్తీ చాక్లెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించింది. అందుకు సంబంధించి కార్తీక్ అనే వ్యక్తిని హెచ్ ఫాస్ట్ టీమ్ అరెస్ట్ చేసింది. ఈ సంస్థలో రసాయన పదార్థాలతో కల్తీ చాక్లెట్లు తయారు చేస్తున్నట్లు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ అండ్ సేఫ్టీ టీమ్‌కు సమాచారం అందింది. దీంతో ఈ సంస్థపై సదరు టీమ్ దాడి చేసింది.

## మంజీరా నదిలో స్నానానికి దిగి ముగ్గురి గల్లంతు




**బాన్సువాడ, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** బాన్సువాడ కామారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగిన నలుగురు ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టగా.. ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం మంగల్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది బాన్సువాడ మండలం బుడిమి శివారులోని మంజీరా నది వద్ద ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చారు. వీరిలో భానుప్రసాద్, అనిత (40), పావని (14), శివాని (13) నదిలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో నదిలో నలుగురూ గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టి భానుప్రసాద్‌ను రక్షించారు. మిగిలిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి.

## నాలాను ఆక్రమించినట్టు తేలితే ఆ భవనాన్ని కూల్చేస్తాం

**భవనాల అక్రమ నిర్వహణ, వాటి అనుమతులపై**

**ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటాం**

**హైడ్రా కమిషనర్ రంగనాథ్**



**హైదరాబాద్, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** హైదరాబాద్‌లో చాలా భవనాలకు ఫైర్ ఎన్‌వోసీలు లేవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. అమీర్‌పేటలోని మైత్రివనం వద్ద గురువారం అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని హైడ్రా కమిషనర్ పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. నగరంలో భవనాల అక్రమ నిర్వహణ, వాటి అనుమతులపై ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదానికి గురైన భవన అనుమతులను పరిశీలిస్తామన్నారు. నాలాను ఆక్రమించి నిర్మించినట్టు తేలితే భవనాన్ని కూల్చేస్తామన్నారు.

## ఎల్‌బీ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైన యంగ్ తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్

**హైదరాబాద్, జూన్ 5 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో, స్పోర్ట్స్ ప్యాడాక్ సహకారంతో నిర్వహిస్తున్న యంగ్ తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్ 2026–27 నేడు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సోనిబాలా దేవి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఫుట్‌బాల్‌ను గ్రామీణ స్థాయి నుంచి ప్రోత్సహించడం, చిన్నారులకు క్రీడా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశాలు కల్పించడం లక్ష్యంగా యంగ్ తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.




"ప్రశ్నాపత్రాల లీక్ వెనుక బిలియన్ల విలువ చేసే వ్యాపారాలు నడుస్తున్నాయి. ఇందులో చాలా పెద్ద వ్యక్తుల హస్తం ఉంది. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే ప్రతి మూడేళ్లకు ఒకసారి పేపర్ లీక్‌లు ఎందుకు అవుతున్నాయి. పంజాబ్ లో ఆప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లైనా ఒక్క లీక్ కూడా జరగలేదు. తమ పార్టీ దిల్లీలో అధికారంలో ఉన్న పదేళ్లపాటు అక్కడ కూడా ఎటువంటి లీక్‌లు చోటుచేసుకోలేదు. భాజపా అధికారంలోకి రాగానే ఈ లీక్‌లు మొదలయ్యాయి. పరీక్షల్లో అవకతవకల నేపథ్యంలో గతంలో తెలంగాణలో బ్యాన్ చేసిన కోఎంప్ట్ ( గ్లోబరీనా) కంపెనీకే కేంద్రం సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానాన్ని కాంట్రాక్ట్ ఇచ్చింది. ఆ కంపెనీ తెలంగాణలో సృష్టించిన సమస్యల వల్ల 20మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. అటువంటి కంపెనీకి ఇంత పెద్ద సీబీఎస్ఈ కాంట్రాక్ట్‌ను ఇవ్వడం వెనుక ఏదో కుట్ర ఉన్నది. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా ఆ కంపెనీపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు."

– కేజ్రీవాల్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి


## వే'మన'పద్యం

హీనగుణమువాని నిలుసేర నిచ్చిన
ఎంతవానికైన నిడుము గలుగు
ఈగ కడుపుజొచ్చి యిట్టట్టు సేయదా?
విశ్వదాభిరామ! వినురవేమ



# వాతావరణ విపత్తుల రూపం: 'ఎల్‌నినో' మానవాళిపై ప్రభావం

భూగోళంపై మానవాళి మనుగడకు, విశ్వవ్యాప్తంగా వివిధ దేశాల ఆర్థిక స్థిరత్వానికి ప్రకృతి వైపరీత్యాలు, అనిశ్చిత వాతావరణ మార్పులు, అకాల వర్షపాతాలు, తీవ్ర కరువు పరిస్థితులు నేడు అత్యంత ఆందోళనకరమైన సవాళ్లుగా మారాయి. పారిశ్రామిక విప్లవం తదనంతర ఆధునిక యుగంలో మానవ తప్పిదాల వల్ల గ్లోబల్ వార్మింగ్ అంటే భూతాపం రోజురోజుకూ పెరిగిపోతోంది. దీనివల్ల కాలచక్రాలు తారుమారై రుతుపవనాల గమనం పూర్తిగా గందరగోళంలో పడింది. ఈ విధమైన అంతర్జాతీయ వాతావరణ మార్పులకు దారితీస్తున్న అత్యంత శక్తివంతమైన, సంక్లిష్టమైన సహజ పర్యావరణ దృగ్విషయాలలో "ఎల్‌నినో" అగ్రగామిగా నిలుస్తోంది. ఇటు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో వచ్చే అసాధారణ మార్పులకు, అటు వాతావరణ పీడన వ్యత్యాసాలకు మధ్య జరిగే ఒక గొలుసుకట్టు ప్రక్రియగా దీనిని శాస్త్రవేత్తలు పరిగణిస్తారు. భూమిపై ఉన్న వివిధ ఖండాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వ్యవసాయ విస్తీర్ణం, జలవనరుల లభ్యత, జీవవైవిధ్యం, అంతిమంగా ప్రపంచ ఆహారోత్పత్తి వ్యవస్థలపై ఎల్‌నినో చూపించే ప్రతికూల ప్రభావం అపారమైనది. ముఖ్యంగా శతాబ్దాలుగా రుతుపవనాలపైనే పూర్తిగా ఆధారపడి సాగుతున్న భారతదేశ నైరుతి రుతుపవన వ్యవస్థను, దేశ గ్రామీణ ఆర్థిక ప్రగతిని అతలాకుతలం చేయడంలో ఎల్‌నినో పాత్ర అత్యంత కీలకంగా మారుతోంది. శాస్త్రీయంగా పరిశీలిస్తే "ఎల్‌నినో" అనే పదం స్పానిష్ భాష నుండి ఉద్భవించింది. స్పానిష్ భాషలో దీనికి "దివ్య శిశువు" లేదా "బాల యేసు" అనే పవిత్రమైన అర్థం ఉంది. దక్షిణ అమెరికా ఖండంలోని పెరూ, ఈక్వెడార్ దేశాల పశ్చిమ తీర ప్రాంతాల్లో నివసించే స్థానిక మత్స్యకారులు శతాబ్దాల క్రితమే ఈ వింతను గుర్తించారు. సాధారణంగా ప్రతి రెండు నుండి ఏడేళ్లకు ఒకసారి, డిసెంబర్ మాసంలో అంటే క్రిస్మస్ పండుగ వచ్చే సమయానికి పసిఫిక్ మహాసముద్ర తీర జలాలు అసాధారణంగా వేడెక్కడాన్ని వారు గమనించారు. బాల ఏసు పుట్టిన కాలంలో ఈ మార్పు వస్తుంది కాబట్టి దీనికి ఎల్‌నినో అని నామకరణం చేశారు. సాధారణ పర్యావరణ పరిస్థితులలో పసిఫిక్ మహాసముద్రం పశ్చిమ భాగంలో అంటే ఆస్ట్రేలియా, ఇండోనేషియా వైపు వెచ్చని నీరు నిల్వ ఉంటుంది, తూర్పు పసిఫిక్ భాగంలో అంటే దక్షిణ అమెరికా తీరం వైపు చల్లని నీరు పైకి ప్రవహిస్తుంది. దీనిని హంబోల్ట్ లేదా పెరూ కరెంట్ అంటారు. అయితే ఎల్‌నినో సంభవించిన కాలంలో పసిఫిక్ సముద్రంపై తూర్పు నుండి పడమర వైపు వీచే వాణిజ్య పవనాలు బాగా బలహీన పడతాయి. దీనివల్ల పశ్చిమ పసిఫిక్‌లోని వెచ్చని జలాలు వెనక్కి కదిలి, మధ్య మరియు తూర్పు పసిఫిక్ మహాసముద్ర ఉపరితలానికి విస్తరిస్తాయి. ఇలా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ సగటు కంటే కనీసం 0.5 డిగ్రీల సెల్సియస్ నుండి 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ వరకు అంతకంటే ఎక్కువగా పెరిగిపోతాయి. ఈ ఉష్ణోగ్రతల పెరుగుదల కేవలం కొన్ని రోజులు కాకుండా దాదాపు తొమ్మిది నుండి పద్దెనిమిది నెలల పాటు సుదీర్ఘంగా కొనసాగుతూ వాతావరణ చక్రాలను శాసిస్తుంది. వాతావరణ శాస్త్రంలో ఎల్‌నినో అనేది విడిగా జరిగే ప్రక్రియ కాదు, ఇది "ఎల్‌నినో-సదరన్ ఆసిలేషన్" అనే ఒక బృహత్తర సముద్ర-వాతావరణ పీడన వ్యవస్థలో అంతర్భాగం. పసిఫిక్ సముద్ర జలాల ఉష్ణోగ్రతలకు, వాతావరణంలో ఏర్పడే గాలి పీడన మార్పులకు అంటే సదరన్ ఆసిలేషన్‌కు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఇది సూచిస్తుంది. దీనికి పూర్తిగా వ్యతిరేకమైన వాతావరణ పరిస్థితిని "లా నినా" అని పిలుస్తారు, స్పానిష్‌లో దీని అర్థం 'చిన్నారి అమ్మాయి'. లా నినా కాలంలో వాణిజ్య పవనాలు మరింత బలాన్ని పుంజుకుని, తూర్పు పసిఫిక్ సముద్ర జలాలను సాధారణం కంటే విపరీతంగా చల్లబరుస్తాయి. దీని ఫలితంగా ఆస్ట్రేలియా, ఆసియా ఖండాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవిస్తాయి. ఈ విధంగా ఎల్‌నినో, లా నినా మరియు తటస్థ పరిస్థితులు ఒకదాని తర్వాత ఒకటి చక్రాకారంలో మారుతూ ప్రపంచ వాతావరణ సమతుల్యతను నిరంతరం ప్రభావితం చేస్తుంటాయి. ఈ చక్రం ఒక క్రమ పద్ధతిలో రానప్పటికీ, మానవ నిర్మిత కాలుష్యం కారణంగా దీని పునరావృత వేగం పెరుగుతోందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారతదేశాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఇక్కడి వ్యవసాయ రంగానికి, వందల కోట్ల ప్రజల జీవన ప్రమాణాలకు నైరుతి రుతుపవనాలే ప్రధాన ఆధారం. మన దేశ వార్షిక వర్షపాతంలో సింహభాగం, అంటే సుమారు 70 నుండి 75 శాతం వర్షాలు కేవలం జూన్ నుండి సెప్టెంబర్ మధ్య కురిసే నైరుతి రుతుపవనాల ద్వారానే లభిస్తాయి. దేశంలోని సగానికి పైగా నికర సాగు భూమి ఇప్పటికీ ఈ వర్షాలపైనే ఆధారపడి ఉంది. జలాశయాల నిండడం, భూగర్భ జలాల పునరుద్ధరణ, తాగునీటి సరఫరా, జలవిద్యుత్ ఉత్పత్తి, గ్రామీణ మార్కెట్లలో కొనుగోలు శక్తి అన్నీ ఈ నాలుగు నెలల వర్షాలపైనే ముడిపడి ఉంటాయి.




ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడినప్పుడు భూమధ్యరేఖ ప్రాంతంలో వాతావరణ పవనాల గమనం మారిపోతుంది. దీనివల్ల హిందూ మహాసముద్రం నుండి భారతదేశం వైపు రావాల్సిన తేమతో కూడిన రుతుపవన గాలులు బలహీనపడతాయి. పసిఫిక్ సముద్రంలోని అల్పపీడన కేంద్రాలు రుతుపవన మేఘాలను తమ వైపుకు ఆకర్షించడం వల్ల భారతదేశంలో వర్షపాతం తీవ్రంగా క్షీణిస్తుంది. రుతుపవనాలు ఆలస్యంగా రావడం, వచ్చిన తర్వాత సుదీర్ఘ కాలం పాటు వర్షాలు పడకుండా పొడి వాతావరణం ఏర్పడటం, సకాలంలో పంటలు వేయలేక పోవడం వంటి నష్టాలు సంభవిస్తాయి. భారతదేశ వాతావరణ చరిత్రను, గత రెండు శతాబ్దాల గణాంకాలను లోతుగా విశ్లేషిస్తే, దేశంలో సంభవించిన ఘోరమైన కరవులకు, ఎల్‌నినో సంవత్సరాలకు మధ్య అత్యంత స్పష్టమైన, విడదీయరాని సంబంధం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు నిరూపించారు. గడచిన 150 ఏళ్ల కాలంలో దేశంలో సంభవించిన పెద్ద కరవులలో దాదాపు 80 శాతానికి పైగా ఎల్‌నినో ప్రభావం వల్లనే జరిగాయి. చారిత్రాత్మకంగా చూస్తే 1877, 1899, 1918, 1965, 1972, 1982, 1987, 2002, 2009, 2015, ఆ తర్వాత 2023-24లలో ఎల్‌నినో తీవ్ర రూపం దాల్చింది. బ్రిటీష్ పాలనలో 1877లో వచ్చిన ఎల్‌నినో వల్ల 'మహా కరవు' ఏర్పడి దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆకలితో ప్రాణాలు కోల్పోయారు. అలాగే 1918 నాటి ఎల్‌నినో కాలంలో దేశంలో వర్షపాతం ఏకంగా 25 శాతం మేర పడిపోయి ఆహార సంక్షోభం తలెత్తింది. ఆధునిక కాలంలో 2002 వ సంవత్సరంలో ఏర్పడిన ఎల్‌నినో వల్ల దేశవ్యాప్తంగా నైరుతి వర్షపాతంలో దాదాపు 19 శాతం లోటు నమోదైంది, ఇది దశాబ్ద కాలంలోనే అత్యంత ఘోరమైన కరవుకు దారితీసింది. మళ్లీ 2009లో ఎల్‌నినో సృష్టించిన బీభత్సం వల్ల వర్షపాతం 22 శాతం తగ్గి, దేశంలోని సగానికి పైగా జిల్లాలను కరవు పీడిత ప్రాంతాలుగా ప్రకటించాల్సి వచ్చింది. 2015లో నమోదైన బలమైన ఎల్‌నినో వల్ల మహారాష్ట్రలోని మరఠ్వాడ, బుందేల్‌ఖండ్ వంటి ప్రాంతాల్లో తాగునీటికి కూడా హాహాకారాలు వ్యక్తమయ్యాయి. ఇటీవలి కాలంలో కూడా ఎల్‌నినో కారణంగా దేశంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరి, శీతాకాలం నిడివి తగ్గిపోవడం మనం గమనించాం.

ఈ ప్రక్రియ కేవలం భారత ఉపఖండానికే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్త వాతావరణాన్ని అతలాకుతలం చేస్తుంది. ఎల్‌నినో క్రియాశీలంగా ఉన్నప్పుడు పసిఫిక్ మహాసముద్రానికి తూర్పున ఉన్న దక్షిణ అమెరికా పశ్చిమ తీర దేశాలైన పెరూ, ఈక్వెడార్, చిలీలలో సాధారణంగా పొడిగా ఉండే ఎడారి ప్రాంతాలలో అసాధారణంగా మేఘమథనం జరిగి అత్యంత భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం సంభవిస్తాయి. దీనికి భిన్నంగా పశ్చిమ పసిఫిక్ సరిహద్దుల్లో ఉన్న ఆస్ట్రేలియా, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, థాయిలాండ్ వంటి దేశాలలో తీవ్రమైన అనావృష్టి ఏర్పడుతుంది. ఆస్ట్రేలియాలోని అడవుల్లో కార్చిచ్చు రేగి వేలాది ఎకరాల వనసంపద, వన్యప్రాణులు బూడిదవుతాయి. ఆఫ్రికా ఖండంలోని హార్న్ ఆఫ్ ఆఫ్రికా అంటే ఇథియోపియా, సోమాలియా వంటి ప్రాంతాల్లో వర్షాలు లేక పశుగ్రాసం నశించి, పశువులు విచ్చలవిడిగా మరణిస్తాయి మరియు మానవ జీవనానికి తీవ్ర ఆహార కొరత ఏర్పడుతుంది. అదే సమయంలో బ్రెజిల్, కొలంబియా వంటి అమెజాన్ అడవుల పరిసర ప్రాంతాలలో కరువు పరిస్థితులు ఉంటే, అమెరికా సంయుక్త రాష్ట్రాల దక్షిణ భాగంలో శీతాకాలంలో చలిగాలుల తీవ్రత పెరిగి, భారీ వర్షపాతం నమోదవుతుంది. వాతావరణ మార్పులతో పాటు సముద్ర జీవవైవిధ్యం, జల పర్యావరణ వ్యవస్థలపై ఎల్‌నినో దెబ్బ అత్యంత ఘోరంగా ఉంటుంది. పెరూ తీర ప్రాంతం ప్రపంచంలోనే అతిపెద్ద మత్స్య సంపద కేంద్రాలలో ఒకటి. సాధారణ రోజుల్లో ఇక్కడ 'అప్‌వెల్లింగ్' అనే ప్రక్రియ ద్వారా సముద్రపు అడుగుభాగం నుండి పోషకాలతో కూడిన చల్లని నీరు పైకి వస్తుంది. ఈ పోషకాలను తిని బతికే 'ప్లాంక్టన్' అనే సూక్ష్మజీవులు, వాటిపై ఆధారపడే 'ఎంకోవి' వంటి చిన్న చేపలు ఇక్కడ కోట్లాదిగా వృద్ధి చెందుతాయి. కానీ ఎల్‌నినో వల్ల వెచ్చని నీరు వచ్చి చేరడంతో ఈ అప్‌వెల్లింగ్ ప్రక్రియ పూర్తిగా ఆగిపోతుంది. నీటిలో పోషకాలు లేక, వేడిని తట్టుకోలేక చేపలు చనిపోవడం లేదా వేరే ప్రాంతాలకు వలస పోవడం జరుగుతుంది. ఇది పెరూ దేశపు ఆర్థిక వ్యవస్థను, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తుంది. మరోవైపు, సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల సముద్ర అంతర్భాగంలోని పగడపు దిబ్బలు తమ రంగును, జీవాన్ని కోల్పోయి చనిపోతాయి. దీనినే 'కోరల్ బ్లీచింగ్' అంటారు. ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన ఆస్ట్రేలియా 'గ్రేట్ బారియర్ రీఫ్' ఎల్‌నినో కాలంలోనే అత్యధికంగా నష్టపోయిందని పర్యావరణ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

మానవ సమాజానికి అత్యంత హాని కలిగించే అంశం వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థలపై ఎల్‌నినో వల్ల రుతుపవనాలు వైఫల్యం చెందితే, ఆసియా ఖండంలో ప్రధాన ఆహార పంటలైన వరి, మొక్కజొన్న, సోయాబీన్, చెరకు, పత్తి, నూనెగింజల సాగు తీవ్రంగా దెబ్బతింటుంది. నీటి కొరత వల్ల సాగు విస్తీర్ణం తగ్గిపోతుంది. రైతులు పంటలను కాపాడు కోవడానికి భూగర్భ జలాలను విపరీతంగా తోడటం వల్ల భూగర్భ జలమట్టాలు పాతాళానికి పడిపోతాయి. ఆహార ధాన్యాల దిగుబడి తగ్గడం మార్కెట్లో డిమాండ్ మరియు సప్లై మధ్య సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఫలితంగా నిత్యావసర వస్తువుల, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతాయి, ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు సన్నగిల్లి, ప్రజల కొనుగోలు శక్తి క్షీణించి, పారిశ్రామిక ఉత్పత్తుల అమ్మకాలు కూడా పడిపోతాయి. అంటే గ్రామీణ పొలాల్లో ప్రారంభమయ్యే ఎల్‌నినో సంక్షోభం, దేశ జీడీపీ వృద్ధి రేటును తగ్గించేంత శక్తివంతంగా మారుతుంది. ప్రస్తుత ఆధునిక కాలంలో గ్లోబల్ వార్మింగ్ లేదా భూతాపం తీవ్రత పెరగడం వల్ల ఎల్‌నినో ప్రవర్తన మరింత సంక్లిష్టంగా, అనూహ్యంగా మారుతోందని అంతర్జాతీయ వాతావరణ పరిశోధకులు మరియు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. శిలాజ ఇంధనాల వాడకం, అడవుల నరికివేత, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాల వల్ల భూగోళంతో పాటు సముద్రాలు కూడా వేడెక్కు తున్నాయి. ఈ అదనపు వేడి పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ఏర్పడే ఫ్రీక్వెన్సీని, దాని తీవ్రతను పెంచుతోంది. ఒకప్పుడు ప్రతి 5 నుండి 7 సంవత్సరాలకు ఒకసారి వచ్చే తీవ్ర ఎల్‌నినో, ఇప్పుడు ప్రతి 2 నుండి 3 సంవత్సరాలకే సంభవిస్తోంది. కొన్ని అత్యాధునిక కంప్యూటర్ నమూనాల అంచనాల ప్రకారం, ఈ శతాబ్దం చివరి నాటికి 'సూపర్ ఎల్‌నినో' వంటి వినాశకరమైన వాతావరణ సంఘటనల సంఖ్య రెట్టింపు అయ్యే ప్రమాదం ఉంది. వాతావరణ మార్పు మరియు ఎల్ నినోల కలయిక వల్ల రాబోయే 2027 సంవత్సరం భూగోళ చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరంగా మారొచ్చని అంతర్జాతీయ పరిశోధనలు ముందే హెచ్చరిస్తున్నాయి.

ఈ విపత్కర పరిస్థితులను ముందే ఊహించి నష్టాన్ని తగ్గించడానికి అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో వాతావరణ శాస్త్ర పరిశోధనలు వేగవంతమయ్యాయి. ప్రపంచ వాతావరణ సంస్థ తో పాటు భారతదేశంలోని భారత వాతావరణ శాఖ వంటి సంస్థలు ఆధునిక ఉపగ్రహాలు, సముద్ర ఉపరితలంపై అమర్చిన బాయ్‌లు, రాడార్ వ్యవస్థలు మరియు సూపర్ కంప్యూటర్ డైనమిక్ మోడల్స్ ద్వారా ఎల్‌నినో రాకను 6 నుండి 9 నెలల ముందే అంచనా వేస్తున్నాయి. ఈ ముందస్తు హెచ్చరికలు ప్రభుత్వాలకు విపత్తు నిర్వహణ ప్రణాళికలు రూపొందించుకోవడానికి, రైతులకు తగిన సలహాలు ఇవ్వడానికి అమూల్యమైన సమయాన్ని అందిస్తున్నాయి. ముందస్తు సమాచారం లభించినప్పుడు దేశాలు తమ ఆహార నిల్వలను, నీటి వనరులను ముందే ప్రణాళికాబద్ధంగా మేనేజ్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ క్రమంలోనే ప్రస్తుత 2026 సంవత్సరానికి సంబంధించిన ముందస్తు అంచనాలు దేశాన్ని కలవరపెడుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న సూపర్ ఎల్-నినో ప్రభావం ప్రస్తుత 2026 నైరుతి రుతుపవనాలపై జూలై నెల నుంచి స్పష్టంగా కనిపించడం ప్రారంభమవుతుందని నిపుణులు గట్టిగా అంచనా వేస్తున్నారు. జూన్ ఒకటవ తేదీన ఎప్పటిలాగే కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు దేశ అంతర్భాగంలోకి ముందుకు కదలడంలో తీవ్రమైన ఇబ్బందులు, ఆటంకాలు తలెత్తే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా జూలై మాసంలో ఉత్తర, మధ్య, పశ్చిమ భారతదేశ ప్రాంతాలలో వర్షపాతంలో భారీ లోటు వచ్చే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. దీనివల్ల దేశానికి అన్నపూర్ణలుగా నిలిచే పంజాబ్, హర్యానాతో పాటు దేశ రాజధాని ప్రాంతమైన ఢిల్లీలలో తీవ్రమైన కరవు పరిస్థితులు రావచ్చునని వాతావరణ మోడల్స్ సూచిస్తున్నాయి. అదేవిధంగా పారిశ్రామిక, వ్యవసాయ ప్రాధాన్యమున్న మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ లలో కూడా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే ప్రమాదం ఉంది.

అయితే, అత్యంత ఆసక్తికరంగా మరియు ఆందోళనకరంగా జూలై - ఆగస్టు నెలల్లో దక్షిణాది రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన అకాల వర్షాలు కురిసి హఠాత్తుగా వరదలు రావచ్చునని తాజా అంచనాలు చెబుతున్నాయి. ఈ వాతావరణ వైపరీత్యం మరింత ముదిరి సెప్టెంబరు మాసంలో ముఖ్యంగా చెన్నై మహానగరంతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సముద్ర తీర ప్రాంతాల్లో తీవ్రమైన సమస్యలను తెచ్చిపెట్టవచ్చునని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పరిస్థితులు గనుక ఇదే రీతిన కొనసాగితే, ఈ సూపర్ ఎల్-నినో వినాశకర ప్రభావం కారణంగా తదుపరి వచ్చే 2026-27 రబీ సీజన్ పంటల సాగుపై కూడా తీవ్రమైన వ్యతిరేక ప్రభావం పడుతుంది, ఇది దేశ ఆహార లభ్యతను ప్రశ్నార్థకం చేయవచ్చు. భారతదేశం లాంటి భారీ జనాభా, వ్యవసాయ ఆధారిత వ్యవస్థ కలిగిన దేశం ఎల్‌నినో సవాళ్లను తట్టుకోవాలంటే కేవలం వాతావరణ అంచనాలపైనే కాకుండా క్షేత్రస్థాయిలో నిర్మాణాత్మక ముందస్తు వ్యూహాలపై దృష్టి పెట్టాలి. వర్షపాతం తగ్గుతుందనే సంకేతాలు ఉన్నప్పుడు జల సంరక్షణ పద్ధతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి. సాంప్రదాయ చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించే 'వాటర్ హార్వెస్టింగ్' పద్ధతులను విస్తృతంగా అమలు చేయాలి. వ్యవసాయంలో సాంప్రదాయ పద్ధతుల నుండి మారి తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే డ్రిప్ సేద్యం, స్ప్రింక్లర్ నీటిపారుదల వంటి సూక్ష్మ నీటిపారుదల సాంకేతికతను ప్రోత్సహించాలి. అలాగే, కరువును, అధిక వేడిని తట్టుకుని నిలబడగలిగే స్వల్పకాలిక పంట రకాలను, ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులకు సకాలంలో అందుబాటులో ఉంచాలి. నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి, చెరకు వంటి పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే తృణధాన్యాలు, పప్పుధాన్యాల వైపు పంటల వైవిధ్యీకరణ వైపు రైతాంగాన్ని మళ్లించాలి.

భారతదేశం వంటి దేశాలలో ఎల్‌నినో అనేది కేవలం పసిఫిక్ మహాసముద్రంలో జరిగే ఒక సాధారణ భౌతిక మార్పు మాత్రమే కాదు; అది దేశ ఆర్థిక, సామాజిక, పర్యావరణ రంగాల భవితవ్యాన్ని మార్చే ఒక సంక్లిష్ట శక్తి. ప్రకృతి ప్రసాదించే సంకేతాలను శాస్త్రీయ దృక్పథంతో నిరంతరం గమనిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ముందస్తు రక్షణ చర్యలు చేపట్టినప్పుడే మనం ఈ సవాళ్లను అధిగమించగలం. స్థిరమైన నీటి వనరుల నిర్వహణ, పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులు, అడవుల పెంపకం మరియు పటిష్టమైన ప్రభుత్వ విధానాల కలయిక ద్వారానే ఎల్‌నినో తెచ్చే కరువుల తీవ్రతను తగ్గించి, దేశ ఆహార భద్రతను, జల భద్రతను, ఆర్థిక స్థిరత్వాన్ని భవిష్యత్ తరాల కోసం సురక్షితంగా కాపాడుకోగలము. ప్రకృతి సంకేతాలను గమనిస్తూ శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగినప్పుడే వాతావరణ సవాళ్లను అధిగమించి ఆహార భద్రత, జల భద్రత, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం సాధ్యమవుతుంది.

> * వాతావరణ మార్పులతో పాటు సముద్ర జీవవైవిధ్యం, జల పర్యావరణ వ్యవస్థలపై ఎల్ నినో దెబ్బ అత్యంత ఘోరంగా ఉంటుంది. పెరూ తీర ప్రాంతం ప్రపంచంలోనే అతిపెద్ద మత్స్య సంపద కేంద్రాలలో ఒకటి. సాధారణ రోజుల్లో ఇక్కడ 'అప్‌వెల్లింగ్' అనే ప్రక్రియ ద్వారా సముద్రపు అడుగుభాగం నుండి పోషకాలతో కూడిన చల్లని నీరు పైకి వస్తుంది. ఈ పోషకాలను తిని బతికే 'ప్లాంక్టన్' అనే సూక్ష్మజీవులు, వాటిపై ఆధారపడే 'ఎంకోవి' వంటి చిన్న చేపలు ఇక్కడ కోట్లాదిగా వృద్ధి చెందుతాయి. కానీ ఎల్ నినో వల్ల వెచ్చని నీరు వచ్చి చేరడంతో ఈ అప్‌వెల్లింగ్ ప్రక్రియ పూర్తిగా ఆగిపోతుంది. నీటిలో పోషకాలు లేక, వేడిని తట్టుకోలేక చేపలు చనిపోవడం లేదా వేరే ప్రాంతాలకు వలస పోవడం జరుగుతుంది. ఇది పెరూ దేశపు ఆర్థిక వ్యవస్థను, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తుంది. మరోవైపు, సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల సముద్ర అంతర్భాగంలోని పగడపు దిబ్బలు తమ రంగును, జీవాన్ని కోల్పోయి చనిపోతాయి. దీనినే 'కోరల్ బ్లీచింగ్' అంటారు. ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన ఆస్ట్రేలియా 'గ్రేట్ బారియర్ రీఫ్' ఎల్ నినో కాలంలోనే అత్యధికంగా నష్టపోయిందని పర్యావరణ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.



సంగనబట్ల
9440595494

## బీదరికం

ముళ్ల బాట బతుకులో
వేదన నిండిన కష్టాలతో
జీవితం సాగితే గాని
పిడికెడు మెతుకులు
ఆ ఆకలి కడుపులో నిండు!

కష్ట సుఖాల కావడితో
సహనం తో బాధలను మోసి
ఓర్పు తో భారం వహిస్తే గాని
జీవిత చక్రం
ఎత్తు పల్లాలలో పయనించు!

బీదరికం బీటలు బారితే
బతుకు బాటలో ఆవరిస్తే
కన్నీటి జడులు ఉప్పొంగితే
ఎల్లప్పుడూ ఉబికుతూనే
ఉంటాయి
ఆకు రాలి పోయిన సంసార
వృక్షం
మోడును తలపించు
జీవ కళ కోసం మార్గం వెదుకు
ఆ మనసులు

బీదరికం శాపం కాదు
అవినీతి మర్రి క్రింద
నీతి మొక్క నిలువునా
ప్రజా స్వాముల పాలనలో
రక్తాల్ని పిండేస్తుంటే
బీదరికం ఇంకెక్కడ సమసి
పోయెను

**తుమ్మా రాజా**
**కోదాడ**

## బాధలు సహిస్తే


సమయానికి చెవులు
లేకపోవచ్చు..
సమయానికి విశ్రాంతి ఉండక
పోవచ్చు ..
కళ్లతో మాత్రం అందరినీ
చూస్తుంది !

వెన్నెల్ని చూడాలంటే చీకటిని
ప్రేమించు..
గులాబీ కావాలంటే ముళ్లను
భరించు
సఫలం కావాలంటే
బాధలు సహించు !
మునిగిపోతే సముద్రాన్ని
నిందిస్తారు
గమ్యాన్ని చేరకపోతే
అదృష్టాన్ని నిందిస్తారు
కాలుకు తగిలితే రాయిని
నిందిస్తారు నరులు !

జీవితంలో ఎంత గెలిచినా
మరణం తప్పదు
తాత్కాలిక జీవితానికి ఈర్ష్య,
అసూయ, గొప్పలు..
తిప్పలు, కన్నీళ్లు, కపట
ప్రేమలు ఎందుకు !
జీవితం ఎంత
విచిత్రమైందో కదా...
బాధల్లో అందరూ దూరంగా
ఉంటారు..
సంతోషంలో ఒంటరిగా
వదిలి పెట్టరు !

**మధుపాళీ**
*9949700037*

## చీకటిని తొలగించే దీపంలా



నిశ్శబ్దం మాటలయ్యే వేళ,
నీడలే తోడుగా నడిచే వేళ,
మనసు తనతో తాను
మాట్లాడుకునే క్షణమే ఏకాంతం.

చీకటిని తొలగించే దీపంలా,
మనలోని అంతర్లీన అంధకారం,
అశక్తతలను పారద్రోలే
మందువంటిది ఏకాంతం.

గత జ్ఞాపకాల తలుపులు తట్టి,
నవ్వుల పువ్వులు పూయించి,
ఆనందబాష్పాలకు
స్థానం ఇచ్చేది ఏకాంతమే.

ఏకాంతం బాధ కాదు
ఒక పాఠశాల
మనకు మనమే గురువులమయ్యే
అంతరంగ స్థలం.

మన కలలు పురుడు పోసుకునే చోటు,
భయాలు కరిగిపోయే క్షణం,
ఆత్మవిశ్వాసం బలపడే
నిశ్శబ్దపు లోకం ఏకాంతం.

ప్రపంచం నుంచి కాదు,
మనలోనికి మనం చేసే
లోతైన ప్రయాణమే ఏకాంతం.

మన నిజ స్వరూపం,
జీవిత
పరమార్థం తెలిపేది
ఈ ఏకాంతమే.



**డా. ఆవుల రేణుక**
**9398268976**

# సృష్టిలోనే ఆమెకు కష్టాలు

ప్రకృతి మహిళలపై వివక్ష చూపింది. సృష్టిలోనే ఆమెకు కష్టాలను అంటగట్టింది. పురుషుడితో పోల్చితే మహిళలకు పుట్టుకతోనే కొన్ని శారీరక, జీవ వ్యవస్థలకు సంబంధించిన అసౌకర్యాలను కల్పించడం జరిగింది. మహిళ గర్భం దాల్చడం, నవమాసాలు మోయడం, ప్రసవ వేదనను అనుభవించడం, రొమ్ముపాలు ఇస్తూ పిల్లల్ని పెంచడం, ఆరోగ్య ప్రతికూలాల నడి అబార్షన్ చేయించుకోవడం, నెలసరి రుతుస్రావం అనుభవించడం, శారీరక అవయాల్లో తేడాలతో వివక్షకు గురి కావడం లాంటివి మహిళలకు మాత్రమే కేటాయించిన సృష్టి కర్త పురుషున్ని రారాజుగా, కుటుంబ పెద్దగా నిలపడం జరిగింది. లౌంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం, మహిళా హక్కులను ప్రచారం చేయడానికి, మహిళల్ని చైతన్యవంతులుగా మార్చడానికి 1987 నుంచి ప్రతి ఏట 28 మే రోజున "అంతర్జాతీయ మహిళా ఆరోగ్య చర్యల దినం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఆక్షన్ ఫర్ వూమెన్స్ హెల్త్"ను పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 అంతర్జాతీయ మహిళా ఆరోగ్య చర్యల దినోత్సవం ఇతివృత్తంగా "లైంగిక మరియు పునరుత్పత్తి ఆరోగ్యం మరియు హక్కులను (SRHRJ) రక్షించడం మరియు అందరికీ న్యాయం అందించడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. మహిళా సాధికారత, మహిళా సమానత్వం, మహిళా ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం, సెక్స్ ఎడ్యుకేషన్ పట్ల కనీస అవగాహన కొరవడడం లాంటి సమస్యలు అనాదిగా మహిళా లోకాన్ని వేదిస్తున్నాయి. కసెక్స్ అండ్ రిప్రొడక్టివ్ హెల్త్ అండ్ రైట్ (ఎస్ఆర్‌హెచ్ఆర్) అంశాన్ని అవగాహన పర్చడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి.

> **ఆమెకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లేదు. పెళ్లి చేసుకోవడానికి ఆమె అంగీకారం అవసరం లేదు. గృహ హింసకు ఆమె వీపు ఓ దెబ్బలకు వేదిక. గర్భం దాల్చడానికి లేదా అబార్షన్ చేసుకోవడానికి ఆమె అనుమతి అవసరం లేదు. చివరకు భర్తతో లౌంగిక సంబంధానికి ఆమె అనుమతి అవసరం లేదు.**

**మహిళల్ని వేధిస్తున్న ప్రధాన అనారోగ్యాలు**

మహిళలు, బాలికలు ఆజన్మాంతం వివక్ష వలయంలో చిక్కి నరకయాతన అనుభవిస్తున్నారు. మహిళ గోడును వినే నాధుడే కరువైనాడు. ఆమెకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లేదు. పెళ్లి చేసుకోవడానికి ఆమె అంగీకారం అవసరం లేదు. గృహ హింసకు ఆమె వీపు ఓ దెబ్బలకు వేదిక. గర్భం దాల్చడానికి లేదా అబార్షన్ చేసుకోవడానికి ఆమె అనుమతి అవసరం లేదు. చివరకు భర్తతో లౌంగిక సంబంధానికి ఆమె అనుమతి అవసరం లేదు. ఆమెకు ఇష్టం లేకపోయినా, అనారోగ్యంతో ఉన్నా ఆయన చేతిలో నలిగి పోవాల్సిందే. రుతుస్రావ చక్రంలో తగు ఆరోగ్య సురక్షలు అందుబాటులో లేవు. అనారోగ్యానికి ఆమె శరీరమే వేదిక. ప్రసవ సమయంలో మరణించే మహిళల సంఖ్య కూడా ఎక్కువే. గర్భాశయ / రొమ్ము/ జననేంద్రియ క్యాన్సర్, స్థూలకాయం, మధుమేహం, జననేంద్రియ అనారోగ్యాలు, తల్లి అనారోగ్యం, రుతువిరతి, నిరాశ/ఆందోళన, ఆస్టియోపోరెసిస్, ఆటోఇమ్యూన్ వ్యాధులు, పోషకాహారలోపం, శారీర వ్యాయాల లోపం, థైరాయిడ్ రుగ్మతలు, గుండె జబ్బులకు ఆమె దేహమే అనుకూలం. రక్తహీనత, లింగ వివక్ష, మూత్రనాళ అనారోగ్యాలు, మూత్రశాలలు తగినన్ని లేకపోవడం, స్థూలకాయం, లౌంగిక సంబంధ వ్యాధులు, రుతుస్రావ అనారోగ్యాలు, గర్భస్థ సమస్యలు, సంతానలేమి, లౌంగిక విజ్ఞానం లోపించడం లాంటి అంశాలతో పాటు పలు రకాల లౌంగిక సంబంధ వ్యాధులకు మహిళ లేదా బాలిక శరీరం ఓ ప్రయోగశాలగా మారింది. లౌంగిక, పునరుత్పత్తి ఆరోగ్య హక్కులను మహిళలకు విధిగా కల్పిస్తేనే సామాజిక న్యాయం, లింగ సమానత్వం, సుస్థిరాభివృద్ధి సుసాధ్యం అవుతాయి. నా శరీరం, నా హక్కు అనే నినాదం మహిళకు రక్షణ కావాలి. పురుషులు మహిళల అభిప్రాయాలకు గౌకరవం ఇవ్వాలి. మహిళల లౌంగిక, పునరుత్పత్తి ఆరోగ్య హక్కును పురుషాధిక్య సమాజం కాపాడాలి. మహిళలకు తగు స్వేచ్ఛను ఇవ్వడం, వివక్షకు దూరంగా ఉండడం, గృహ హింసకు తావులేకుండా ఉండడం నేటి సమాజ కనీస బాధ్యత.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# జాతీయం-అంతర్జాతీయం



## భారత విదేశాంగ విధానంపై
# పుతిన్ ప్రశంసల జల్లు!

**సెయింట్ పీటర్స్‌బర్గ్:** భారతదేశ విదేశాంగ విధానంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్( ప్ర శంసలు కురిపించారు. ఇండియాతో బంధాన్ని మరింత విస్తృతం చేసుకు నేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. రష్యాతో రిలేషన్ అంశంలో భారత్‌పై అమెరికా వత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించిందని, కానీ ఆ ప్రయత్నా ల్లో అమెరికా విఫలమైనట్లు పుతిన్ పే ర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాల ను అమెరికా బలహీనపరిచే ప్రయత్నం చేసిందని ఆరోపించారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేటి న్యూస్ ఏజెన్సీలతో పుతిన్ మాట్లాడారు. ఈ సం దర్భంగా భారత ఆర్థిక వృద్ధిని ఆయన ప్రశంసించారు. భారత వ్యక్తిగత విదేశాంగ విధానాన్ని కూడా ఆయన మెచ్చుకున్నారు.భారత్‌తో ఆర్థిక సం బంధాన్ని కొనసాగించేందుకు దృఢ ని శ్చయంతో ఉన్నట్లు పుతిన్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని, ఆ దేశంలో ప్రస్తుతం ఆర్థిక వృద్ధి ఇంప్రెసివ్‌గా ఉందని పుతిన్ అన్నారు. రాబోయే రోజుల్లో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు వంద బిలియన్ల డా లర్లకు చేరుకోనున్నట్లు ఆయన విశ్వా సాన్ని వ్యక్తం చేశారు. భారత్‌పై పశ్చిమ దేశాలు వత్తిడి తేవాలని ప్రయత్నిస్తే అది ఆ దేశాలకు బ్యాక్‌ఫైర్ అవుతుందని పుతిన్ అన్నారు. ఇండియాపై ప్రెజర్ పెట్టాలని అమెరికా ప్రయత్నిస్తోందని, కానీ అత్యధిక జనాభా గల భారత్‌పై కానీ, మోదీపై కానీ వత్తిడి తేస్తే, అది అంతర్జాతీయ సంబంధాలకు, ద్వైపా క్షిక బంధాలకు విఘాతం అవుతుందని పుతిన్ తెలిపారు.

# భారత్‌తో చర్చలకు ట్రంప్ మధ్యవర్తిత్వం

**కాశ్మీర్ అంశంపై ట్రంప్ జోక్యం కోరిన పాకిస్తాన్: అమెరికా సాయం కోసం షెహబాజ్ షరీఫ్ ఆశలు**



ఇండియాకు, పాకిస్తాన్‌కు మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక పాత్ర పోషించారని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ ఎప్పుడూ ట్రంప్‌నకు రుణపడి ఉంటుందని, ఆయనకు షెహబాజ్ ధన్యవాదాలు తెలిపాడు. అంతేకాదు.. ట్రంప్‌ను 'మ్యాన్ ఆఫ్ పీస్' (శాంతి కాముకుడు) గా అభివర్ణించాడు.అమెరికాకు స్వాతంత్ర్యం లభించి 250 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఇస్లామాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం శుక్రవారం నిర్వహించిన ఒక కా ర్యక్రమంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ గురించి ఈ వ్యాఖ్యలు చేశాడు. గత ఏడాది జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం లో పాక్ ఉగ్రవాదులు దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీనికి బదులుగా ఇండియా.. ఆపరేషన్ సిందూర్ ప్రారంభించింది. పాకిస్తాన్‌పై దాడులకు దిగింది. ఈ దాడుల్ని ప్రభుత్వం తర్వాత నిలిపివేసింది. పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదు ర్చుకుంది. ఈ యుద్ధాన్ని ఆపింది తానేనని ట్రంప్ అనేకసార్లు చెప్పాడు. దీంతో అమెరికా ఒత్తిడికి ఇండియా తలొగ్గిందని అనేక విమర్శలు వచ్చాయి. గత ఏడాది మే 10న కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.తాజాగా ఈ అంశంపై పాక్ ప్రధాని మాట్లాడారు. ట్రంప్ సరైన సమయంలో జోక్యం చేసుకుని, ఇండియా దాడుల్ని ఆపారని, రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చారని అన్నారు. అందు వల్ల పాకిస్తాన్ అమెరికాకు, ట్రంప్‌నకు ఎప్పటికీ రుణపడి ఉంటుందని, ఇందుకు ట్రంప్‌నకు ధన్యవాదాలు అన్నారు. ఆయన జోక్యం వల్ల దక్షిణాసియాలో శాంతి నెలకొందని, మిలియన్ల ప్రజల్ని ఆయన కాపాడారని షెహబాజ్ అన్నారు. అమెరికాకు, పాకిస్తాన్‌కు మధ్య ప్రత్యేక బంధం ఉందన్నారు.

# ఢిల్లీ వైపు మమత చూపు

## త్వరలో లోక్‌సభ బరిలోకి టీఎంసీ అధినేత్రి!



**ఢిల్లీ (ఎ.ఎం.ఎస్):** పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ లోక్‌సభపై దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పార్టీ ఘోర ఓటమి తర్వాత ఆమె చూపు పార్లమెంట్‌వైపు పడినట్లు సమాచారం. దీంతో త్వరలోనే ఆమె లోక్‌సభకు పోటీ చేయనుందని పార్టీ వర్గాలు అం టున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో గత ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టీఎంసీ ఘోర పరాజయం పాలై, అధికారం కోల్పోయింది. మమతా బెనర్జీయే అసెంబ్లీ సీటును గెల్చుకోలేకపోయింది. అటు పార్టీ పరాజయం, ఇటు తాను ఎమ్మెల్యేగా ఓడిపోయిన నేపథ్యంలో రాష్ట్రంలో ఉండటం కంటే ఢిల్లీయే బెటర్ అని మమతా భావిస్తోంది. అందుకే పార్లమెంట్‌వైపు చూస్తున్నా రు. లోక్‌సభకు తిరిగి ఎంపీగా వెళ్లాల నుకుంటున్నారు. అయితే, ఇప్పుడేమీ ఎన్నికలు లేవు. ఉప ఎన్నికలూ లేవు. మరెలా..? దీనికి సమాధానం ప్రస్తుతం టీఎంసీ తరపున ఎంపీగా కొనసాగు తున్న యూసుఫ్ పఠాన్. మాజీ క్రికెటర్ అయిన యూసుఫ్ పఠాన్ 2024లో జరిగిన ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని బహరాంపూర్ పార్లమెంట్ నియోజక వర్గం నుంచి ఆయన టీఎంసీ తరపున లోక్‌సభ ఎంపీగా గెలుపొందారు. కాంగ్రెస్ అగ్రనేత అధిర్ రంజాన్ చౌదరిని భారీ మెజారిటీతో ఓడించారు. అయితే, ఇప్పుడు ఆ స్థానం నుంచి మమత పోటీ చేయాలనుకుంటున్నారు. ఇందుకోసం ఆ సీటు నుంచి రాజీనామా చేయాలని యూసుఫ్ పఠాన్‌కు మమత సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి ఆయన కూడా సానుకూలంగానే ఉన్నారని తెలుస్తోంది. ఇదే జరిగితే, అక్కడ జరిగే ఉప ఎన్నికలో టీఎంసీ తరపున మమతా బెనర్జీ పోటీ చేస్తారు. మమతా బెనర్జీ గతంలో కూడా ఎంపీగా పనిచేశారు. 1974 నుంచి ఆరుసా ర్లు కోల్‌కతా సౌత్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. 1984లో తొలిసారి జాధవ్‌పూర్ నుంచి కాంగ్రెస్ తరపున ఎంపీగా గెలిచారు. అనంతరం 1989లో ఓడిపోయారు.తర్వాత కోల్‌కతా సౌత్ (ప్రస్తుతం కోల్‌కతా దక్షిణ్) నియోజకవర్గం నుంచి 1991, 1996లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలిచారు. అనంతరం ఆమె కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి, సొంత పార్టీ టీఎంసీని స్థాపించారు. 1998, 1999, 2004, 2009లో ఎంపీగా గెలిచారు. మరి యూసుఫ్ పఠాన్ రాజీనామా చేస్తే ఆ స్థానం నుంచి పోటీ చేసి గెలుస్తారా లేదా అనేది చూడాలి.

# ట్రైన్ కోచ్ విండోకు పెద్ద పెట్టెను కట్టిన ప్రయాణికులు.

**పాట్నా:** ఒక రైలు బోగి కిటికీకి పెద్ద పెట్టెను కొందరు ప్రయాణికులు కట్టారు. దానిని లోపల నుంచి గట్టిగా పట్టుకు న్నారు. ఆ రైలు స్టేషన్ నుంచి కదిలిన వీడియోతో పాటు భారీ పెట్టెను రైలులోకి ఎక్కించేందుకు మహిళలు ప్రయత్నించిన మరో వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ రెండు సంఘటనలు బీహార్‌లో జరిగాయి. ఒక రైల్వే స్టేషన్‌లో రైలు ఆగింది. కొందరు ప్రయాణికులు పెద్ద పెట్టెను రైలు బోగి కిటికీకి బయట నుంచి కట్టారు. రైలు బయటకు వే లాడుతున్న ఆ పెట్టెను లోపల నుంచి గట్టిగా పట్టుకున్నారు.కాగా, ఆ రైలు స్టేషన్ నుంచి కదలడంతో ఒక వ్యక్తి దీనిని రికార్డ్ చేశాడు. 'ఇది బీహార్' అని పేర్కొంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ వీడియో క్లిప్ వైరల్ అయ్యింది. దీంతో రైలుతో పాటు ప్ర యాణికుల భద్రతపై పలువురు నెటిజ న్లు ప్రశ్నలు లేవనెత్తారు. ఆ పెట్టె స్తంభా నికి ఢీకొడితే రైలు ప్రమాదాన్ని ఆహ్వా నించినట్లు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అనుమతించిన సంబంధిత రైలు గార్డు, స్టేషన్ మాస్టర్, టీటీఈ, రైల్వే పోలీసులు, రైల్వే అధి కారులపై కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు.అయితే ఈ వీడియో క్లిప్‌పై రైల్వే పెద్దగా స్పందించలేదు. 'దయచేసి స్టేషన్ పేరు, రైలు నంబర్, మీ మొబైల్ నంబర్‌ను మాకు తెలియ జేయండి. సమస్య త్వరితగతిన పరిష్కా రం కావడానికి మీరు నేరుగా 'రైల్‌మ దద్'లో ఫిర్యాదు చేయవచ్చు లేదా 139 నంబర్‌కు కాల్ చేయవచ్చు' అని ఎక్స్‌లో పేర్కొంది.మరోవైపు బీహార్‌లో ని మరో రైల్వే స్టేషన్‌లో ఇలాంటి మరో సంఘటన జరిగింది. ఇద్దరు మహిళలు పెద్ద పెట్టెను రైలులోకి ఎక్కించేందుకు ప్రయత్నించారు. సాధ్యం కాకపోవ డంతో వారు ఆ రైలులోకి ఎక్కలేకపో యారు. ఆ పెట్టెను తలపై మోసుకుని వెళ్లిపోయారు. బీహార్‌కు చెందిన అభిషేక్ కుమార్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ వీడియో క్లిప్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# నో పార్కింగ్ జోన్‌లో విమానం





పార్కింగ్‌లో నిలిపి ఉంచిన లుఫ్తాన్సా కు చెందిన ఓ బోయింగ్ విమానం ఉన్నట్టుండి నేలపై పడింది. ఈ ఘటనలో పలువురు సిబ్బంది గాయప డ్డారు. ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకో గా.. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. లుఫ్తాన్సాకు చెందిన బోయింగ్ 7879 విమానం ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి లాస్ ఏం జెలెస్‌కు వెళ్లాల్సిఉంది. ఈ క్రమంలో ఫ్రాంక్‌ఫర్ట్ గేటు వద్ద పార్క్ చేసి ఉన్న విమానం ల్యాండింగ్ గేర్ ఉన్నట్టుండి విరిగిపోయింది. దీంతో విమానం ముందుభాగం నేలపై పడింది. ఘటన జరిగిన సమయంలో ఆ విమానంలో ప్రయాణికులు ఎవరూ లేరని ఎయి ర్‌లైన్స్ ప్రతినిధి తెలిపారు. అయితే, విమానంలో పలువురు విమానయాన సిబ్బంది, గ్రౌండ్ స్టాఫ్ ఉన్నారని వెల్ల డించారు.

వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అం దిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో విమానం తీవ్రంగా దెబ్బతిందని అధికా రులు పేర్కొన్నారు. అయితే ప్రమాదాని కి గల కారణం ఇంకా తెలియరాలేదు. దీనిపై దర్యాప్తును ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

# మణిపూర్ అలజడి

**: పలు జిల్లాల్లో హింసాత్మక ఘటనలు.. ఇంటర్నెట్ సేవల నిలిపివేత!**





ఇంఫాల్: మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. సాయుధ దుండగులు ఒక గ్రామంపై దాడి చేశారు. పలు వురిపై కాల్పులు జరిపారు. పలు ఇళ్లకు నిప్పంటించారు. దుండగుల కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు మరణిం చారు. భద్రతా దళాలు ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నాయి. కాంగ్‌పోక్పి జిల్లాలో న్యూ కీథెల్మాన్బి ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 4.10 గంటల సమయంలో సాయుధులైన దుండగులు లోయిబోల్ గ్రామంపై దాడి చేశారు. సాయుధ మిలిటెంట్లు విచక్ష ణారహితంగా కాల్పులు జరుపడంతో ముగ్గురు వ్యక్తులు మరణించారు. పలు ఇళ్లకు వారు నిప్పంటించగా అవి కాలి బూడిదయ్యాయి. ఈ సంఘటనతో ఆ గ్రామంలో తీవ్ర భయాందోళనలు నెల కొన్నాయి.

కాగా, ఈ సమాచారం తెలుసుకున్న భద్రతా దళాలు ఆ ప్రాంతానికి చేరుకు న్నాయి. గ్రామంపై దాడి చేసిన సాయుధ మిలిటెంట్లను గుర్తించేందుకు ప్రయత్ని స్తున్నారు. ప్రభావిత ప్రాంతం, పరిసర ప్రాంతాల్లో అదనపు భద్రతా సిబ్బందిని మోహరించారు. ఆ ప్రాంతంలో ఉద్రి క్తతలు కొనసాగుతుండటంతో అక్కడి పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# బీజేపీకి అన్నామలై గుడ్‌బై

**కొత్త రాజకీయ ఉద్యమానికి శ్రీకారం.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యం!**



తమిళనాడు రాజకీయ నేత కే అన్నా మలై బీజేపీకి రాజీనామా చేశారు. ఈ అంశంపై ఆయన శుక్రవారం స్పందిం చారు. తాను కొత్త రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించబోతున్నట్లు వెల్లడించారు. తాను స్వతంత్ర రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తమిళ నాడులో గత ఏడాదివరకు బీజేపీకి అధ్యక్షుడిగా పనిచేశారు అన్నామలై. అనంతరం పదవి నుంచి తొలగించి నప్పటికీ ఆయన బీజేపీలోనే ఉన్నారు. తాజాగా బీజేపీకి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. బీజేపీ కూడా ఆయన రా జీనామాను ఆమోదించింది. అన్నామలై వెళ్లిపోవడం వల్ల తమకు పెద్దగా నష్టం లేదని బీజేపీ వ్యాఖ్యానించింది. ఈ నేప థ్యంలో అన్నామలై డిజిటల్ మీడియా వేదికగా శుక్రవారం స్పందించారు. కొత్త రాజకీయ వేదికను ప్రారంభించ బోతున్నట్లు చెప్పారు. వ్యక్తి కేంద్రంగా సాగే రాజకీయాలు కాకుండా కామన్ మ్యాన్ పాలిటిక్స్ చేస్తానన్నారు. తాను బీజేపీకి రాజీనామా చేశానని, శుక్రవా రం నుంచి కొత్త ప్రయాణం ప్రారంభ మవుతుందన్నారు. ఎప్పటిలాగే తనకు అందరి మద్దతు కావాలని కోరారు. పారదర్శకత, విలువలు, ప్రజాసేవ లక్ష్యంగా, స్వచ్ఛమైన, అన్నిస్థాయిల నుంచి వేదికగా నిలిచే రాజకీయ ఉద్య మాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. తన రాజకీయ ఉద్యమం రాజకీయ పార్టీగా మారిన తర్వాత నాయకత్వా నికి సంబంధించి కొత్త మార్గదర్శకాలు నిర్ణయిస్తానన్నారు. నాయకత్వానికి పరిమితులు పెడతానని, కాలపరిమితి నిర్ణయిస్తానని, వారసత్వ రాజకీయా లకు దూరంగా ఉంటానని చెప్పారు. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ప్రో త్సహిస్తానని వివరించారు. ఇప్పటివర కు రాజకీయ పార్టీలు సంప్రదాయబద్ధం గా అమలు చేస్తున్న వ్యక్తి కేంద్రంగా సాగే రాజకయాలకు దూరంగా, సామాన్యుడి రాజకీయంగా తన వేదిక నిలుస్తుంద న్నారు. రాజకీయాలు ఒక వ్యక్తి చుట్టూ తిరగడం సరికాదన్నారు. తన రాజకీయ ఉద్యమంలో చేరిన వారికి ఏపీజే అబ్దుల్ కలాం ఎథిక్స్ ఇన్ పాలిటిక్స్ ఇనిస్టిట్యూ షన్‌లో తగిన శిక్షణ ఇస్తామన్నారు. బీజేపీకి తాను గత ఏడాది డిసెంబర్‌లోనే రాజీనామా చేస్తానని చెప్పానని, కానీ, ఎన్ని కల వరకు ఆగమని చెప్పడంతో ఆగానని ఆయన అన్నారు. తనకు ఇంతకాలం అవకాశం ఇచ్చిన బీజేపీకి కృతజ్ఞతలు తెలిపారు. తమిళనాడులో వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

# అగ్నిప్రమాదానికి గురైన సంరక్షణ కేంద్రం



**కొలంబో:** శ్రీలంక వాణిజ్య రాజధాని నగరమైన కొలంబోకు 65 కి.మీ.ల దూరాన ఉన్న అంగురువాథోటు పట్టణంలో గల వృద్ధుల సం రక్షణ కేంద్రంలో అగ్నిప్రమాదం జరిగి 12 మంది మృతిచెంద గా, ఏడుగురు గాయపడినట్లు పోలీసులు గురువారం వెల్లడిం చారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో 10 మంది అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రగాయా లతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. గ్యాస్ సిలిండరు పేలి మంటలు వేగంగా వ్యాపించి ఉండవచ్చని ప్రా థమిక సమాచారం. ప్రైవేటుగా నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో ప్రమాద సమయంలో 70 మందికి పైగా వృద్ధులు ఉన్నారు. ఇందులో 51 మందిని రక్షించి, సమీపంలోని పాఠశాలలో తాత్కాలిక వసతి సదుపాయం కల్పించారు.

ప్రమాదం అనంతరం సంరక్షణ కేంద్ర యజమానిని పోలీసులు అరెస్టు చేశారు.

# ఒమన్ చమురు టర్మినల్‌లో ప్రమాదం



గల్ఫ్ దేశాలపై ఇరాన్ యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లతో విరు చుకుపడుతోంది. ఈక్రమంలో ఒమ న్‌లోని మినా అల్ ఫహల్ ఆయిల్ టెర్మి నల్‌లో భారీ పేలుడు సంభవించింది. పెద్దఎత్తున అగ్నికీలలు చెలరేగడంతో అప్రమత్తమైన అధికారులు ఫైరింజన్ సహాయంతో మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. ఇరాన్ డ్రోన్ దాడి కారణంగానే పేలుడు సంభవించినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. దీంతో టర్మినల్‌లో చమురు లోడింగ్ నిలిపి వేశారు. చమురు కోసం వచ్చిన పలు సూపర్ ట్యాంకర్లు అక్కడే చిక్కుకుపో యాయి. మళ్లీ చమురు కార్యకలాపాలు ప్రారంభమయ్యే వరకు అవి అక్కడే వేచి ఉండనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు తమ నౌకాదళం ఒమన్ సముద్రంలో ని అమెరికా సైనిక నౌకను లక్ష్యంగా చేసుకుందని ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రకటించింది. తమ దేశ జలాల్లోకి ప్రవే శించడానికి ప్రయత్నిస్తుండగా దానిపై దాడి చేసినట్లు తెలిపింది. కాగా టెహ్రాన్ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ ఖండించింది. ఒమన్ సముద్ర జలాల్లో ని అమెరికా సైనిక ఆస్తులు సురక్షితంగా ఉన్నాయని.. ఏ నౌకపై ఎలాంటి దాడి జరగలేదని స్పష్టంచేసింది.

# పోర్చుగల్‌లో ఉద్రిక్తత

**కొత్త కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా రోడ్లపైకి వచ్చిన లక్షలాది మంది కార్మికులు!**




**లిస్బన్ :** పోర్చుగల్ ప్రధాని లూయిస్ మాంటెనె గ్రో ప్రతిపాదించిన కార్మిక సంస్కరణల బిల్లుకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ పిలుపు మేరకు బుధవారం ఆ దేశ రాజధాని లిస్బన్ వేలాది మంది ప్రజలు, కార్మికు లు ఈ సమ్మెలో పాల్గొన్నారు. అయితే శాంతియుతంగా చేస్తున్న వీరి ఆందో ళనలను పోలీసులు హింసాత్మకంగా అణచివేశారు. పార్లమెంటులో చర్చకు రానున్న ఈ ప్రతిపాదనను కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రధాని ప్రతిపాదన కార్మిక హక్కులపై దాడి చేస్తోందని ట్రేడ్ యూనియన్స్ తీవ్రంగా ఖండిస్తున్నాయి. కార్మిక హక్కుల్ని అణచివేసే ఈ బిల్లును తక్షణ మే ఉపసంహించుకోవాలని లూయిస్ ప్రభుత్వాన్ని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. పనిగంటల పెంపు, ఉద్యోగుల తొలగింపు నిబంధనల్ని సుల భతరం చేయడం, మెటర్నిటీ, పెటర్నిటీ (మాతృత్వ, పితృత్వ) రక్షణ హక్కుల్ని తీవ్రంగా దెబ్బతీసేలా రూపొందించిన కార్మిక సంస్కరణల బిల్లుకు వ్యతిరేకం గా చేపట్టిన సమ్మెలో కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పార్లమెంటు వెలుపల చేపట్టిన ఈ ఆందోళనలో పాల్గొన్న నిరసనకారుల్ని చెదరగొ ట్టేందుకు భద్రతాదళాలు, పోలీసులు ప్రయత్నించారు. నిరసకారులపై లాఠీ ఛార్జీ ప్రయోగించారు.ముగ్గురు ఆందో ళనకారుల్ని పోలీసులు అరెస్టు చేశారు. కాగా, ఈ నిరసనలో పాల్గొన్న జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ పోర్చుగీస్ వర్కర్స్‌నేష నల్ ఇంటర్ సిండికల్ (సిజిటిపిఐఎన్) ప్రధాన కార్యదర్శి టియాగో ఒలివరా మాట్లాడుతూ.. 'ఈ చట్టాన్ని తిరస్కరిం చడానికి మాకు ఇదే సరైన సమయం అని అభిప్రాయపడ్డాం. అందుకే సమ్మెకు పిలుపునిచ్చాం. సంప్రదాయ వాద ప్రభుత్వ ఆర్థిక విధానాలకు వ్యతి రేకంగా పోరాటాన్ని ఉధృతం చేస్తాము ' అని ఆయన అన్నారు. ఆర్థిక వృద్ధి కోసమే లేబర్ కోడ్ సంస్కరణలు తెచ్చి నట్లు పోర్చుగీస్ ప్రభుత్వం చెబుతోంది. అయితే ఇది కేవలం ఒక సాకు మాత్రమే నని కార్మిక సంఘాలు వెల్లడించాయి. కేవలం కార్మిక సంఘాలను బలహీన పరచడం, పని గంటలను పెంచడం, సమ్మె చేసే రాజ్యాంగ హక్కును పూర్తిగా నిర్మూలించడనికే ప్రధాని లూయిస్ మాంటెనెగ్రో ఈ సంస్కరణలు చేపట్టా రని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నా యి. నయా ఉదారవాద విధానాలను అవలంబిస్తున్న పోర్చుగల్ ప్రభుత్వం.. తాజాగా ప్రవేశ పెట్టనున్న కార్మిక సంస్క రణల బిల్లు కార్మికులకు రక్షణ కల్పించే 100కు పైగా నిబంధనల్ని తొలగిస్తుం ది. కొత్త చట్టం అమల్లోకి వస్తే.. కార్మికు లు అక్కడ అదనంగా రెండు గంటలు పనిచేయాలి. మొత్తంగా సంవత్సరానికి 150 గంటలు అదనంగా పనిచేయాలి. ఈ అదనపు పని గంటల్ని పెంచడం ద్వారా.. కార్మికుల శ్రమను దోచుకుని.. కార్పొరేట్లకు లాభాలను కూడబెట్టడాని కేనని కార్మిక సంఘాలు వెల్లడించాయి.

# జైపూర్‌లో ఎబోలా కేసు

**జైపూర్:** ఎబోలా వైరస్ లక్షణాలు ఉన్న ఉగాండా మహిళ రాజస్థాన్ చేరుకున్నది. ఆ మహిళను జైపూర్ ఆస్పత్రికి తరలిం చారు. విమానాశ్రయంలో ఎమర్జెన్సీ చెకింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఆమె ఎబోలా లక్షణాలతో బాధపడుతున్నట్లు తెలిసింది.

దీంతో ఆరోగ్యశాఖ అధికారులు ఆమెను తక్షణమే నగరంలో ఆర్‌యూ హెచ్‌ఎస్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. షార్జా నుంచి ఆమె శుక్రవారం జైపూర్ చేరుకు న్నది. కఠినమైన ఐసోలేషన్‌లో ఆమెకు చికిత్సను అందిస్తున్నారు. ఆ మహిళ నుంచి శ్యాంపిల్లను సేకరించి.. తదుపరి విశ్లేషణ కోసం పుణె ల్యాబ్‌కు పంపారు. ప్రమాదకర ఎబోలా వైరస్‌తో పోలిన లక్షణాలు కనిపించడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. అయితే ఆమెలో ఎబోలా ఇంకా నిర్ధారణ కాలేదని రాజ స్థాన్ వైద్య కళాశాల సూపరిండెంట్ అనిల్ గుప్తా తెలిపారు. రిపోర్టు అందిన తర్వాతే ఇన్‌ఫెక్షన్ నిర్ధారణ జరుగు తుందన్నారు. అయితే హైదరాబాద్‌లో ని శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం ఓ సుడాన్ వ్యక్తిని కూడా ఎబోలా అనుమానంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అంతర్జాతీయ ప్రయాణి కులు నిర్వహిస్తున్న థర్మల్ స్క్రీనింగ్‌లో ఆ వ్యక్తి జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిసింది.కాంగో, ఉగాండా, దక్షిణ సుడాన్ దేశాలకు ప్రయాణాలను రద్దు చేసుకోవాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.




# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## నీటి నిల్వ చెరువును ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి, జూన్ 5 (వుదయం ప్రతినిధి):**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా ఐడిఓసి ప్రాంగణంలో డీఎంఎఫ్ సి(టీ) నిధుల ద్వారా నిర్మించిన నీటి నిల్వ చెరువును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు , పర్యావరణ పరిరక్షణకు నీటి నిల్వ చెరువులు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో వర్షపు నీటిని సద్వినియోగం చేసేందుకు ఇటువంటి చర్యలు చేపట్టడం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.డీఎంఎఫ్ సి(టీ) నిధుల నుంచి రూ.6.55 లక్షల వ్యయంతో ఈ నీటి నిల్వ చెరువును నిర్మించినట్లు తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాల మట్టాన్ని పెంచడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు ఇది ఉపయోగపడుతుందని కలెక్టర్ వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ నీటి నిల్వ చెరువు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెరువు చుట్టూ పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు.

పరిసరాలను పచ్చదనంతో అభివృద్ధి చేయడం ద్వారా కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. నీటి నిల్వ చెరువు పరిసర ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దితే భవిష్యత్తులో బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకలను కూడా ఇక్కడ నిర్వహించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కలెక్టర్ ఎన్ వి గిరి, డిఆర్డీవో దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. జిల్లా కలెక్టర్ కె. హరిత




**బెజ్జూర్ (వుదయం ప్రతినిధి )**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాపెంచికల్‌పేట్ ఫారెస్ట్ డివిజనల్ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హరిత, జిల్లా ఎస్పీ నితికా పంత్, జిల్లా అటవీ అధికారి బాలామణి, అదనపు ఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ డీఎఫ్‌వో అప్పయ్యలతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత వస్తువులను ఉపయోగించాలని సూచించారు. ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాల కోసం ప్రకృతిని కాపాడాలని అన్నారు. అనంతరం అధికారులు ప్లాస్టిక్ రహిత వస్తువుల అవగాహన స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ అనిల్ కుమార్, సర్పంచ్ భక్తు రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ కిట్లను అందజేసిన ఎస్సై



**జన్నారం, జూన్ 5(వుదయం విలేకరి)**

యువకుల క్రీడల పై ఆసక్తి పెంచుకోవాలని జన్నారం ఎస్సై జి ఉదయ్ కిరణ్ అన్నారు. శుక్రవారం రోజున మండలంలోని లో తొర్రే గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై చేతుల మీదుగా యువకులకు వాలీబాల్,నెట్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణను నేర్పుతాయని అన్నారు. యువత ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఆటల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం సర్పంచ్ బోడ శంకర్ ఆధ్వర్యంలో ఎస్సై గుర్రపు ఉదయ్ కిరణ్ ను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ అభివృద్ధి, యువత సంక్షేమం కోసం ఆయన తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా ఎస్సై అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## బడిబాటలో భాగంగా కూలీల వద్దకు ప్రభుత్వ పాఠశాల బృందం

### ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య, కార్పొరేట్ వసతులు

### కమలాపూర్ సర్పంచ్ కుమ్మరి తిరుపతి



**ధర్మపురి, జూన్ 5 (వుదయం ప్రతినిధి):**

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని కమలాపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ సర్పంచ్ కుమ్మరి తిరుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎదుల మహేశ్, ఉపాధ్యాయ బృందం కలిసి ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లారు. అక్క డ కూలీలు, గ్రామీణ తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న అత్యాధునిక వసతులు, అందిస్తున్న నాణ్యమైన విద్యపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతి మాట్లాడుతూ అత్యున్నత విద్యా అర్హతలు కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులచే డిజిటల్ బోధన సాగుతోందని,విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు,రెండు జతల దుస్తులు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విశాలమైన గదులు, తాగునీరు, ప్రత్యేక మరుగుదొడ్లు, గ్రంథాలయ వసతులు ఉన్నాయని, ఈడు వచ్చిన ప్రతి బిడ్డను కమలాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దని హెచ్ఎం ఎదుల మహేశ్ సూచించారు. సర్కారు బడుల్లో కార్పొరేట్ స్థాయి ఉచిత సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మ్యాన పవన్ కుమార్, శ్రీలత, వార్డు సభ్యులు ఒడ్డెటి జయలక్ష్మి శంకర్, ఒడ్డేటి మంజుల, మిల్కూరి సుజాత, సట్టంశెట్టి అనిల్ కుమార్, రాజురి శ్రీనివాస్ గౌడ్, జీపీ కార్యదర్శి దీపిక మరియు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్ర క్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలి

## ఈ.వి. ఎ మ్ గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**కరీంనగర్ జూన్ 05 (వుదయం ప్రతినిధి):**



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎలక్షన్ సిబ్బందితో కలసి తనిఖీ చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా మాట్లాడుతూ ఈవియం గోదాం వద్ద అప్రమత్తంగా ఉండాలనీ సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోడౌన్ లను క్షుణ్ణంగా తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోడౌన్ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవియం గదులను వి వి ప్యాట్ స్టోరేజీ విధానాన్ని పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ అదరపు కలెక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్డిప్యూటీ కలెక్టర్ ఏన్, వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్,బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, సిపియం పార్టీ ప్రతినిధి డి, నరేష్ పటేల్, ఏఐఎంఐఎం పార్టీ ప్రతినిధులు సయ్యద్ ఇబ్రహీం, మాజిద్ హుస్సేన్, బిజెపి పార్టీ ప్రతినిధి బి సాయి కృష్ణ ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అడవుల సంరక్ష ణతోనే గ్లోబల్ వార్మింగ్‌కు చెక్: క లెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్, జూన్ 5 :**



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మారుతున్న వాతావరణ పరిస్థితులు, గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కోవాలంటే అడవుల సంరక్షణే ఏకైక మార్గమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక"లో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ గ్రామీణ మండలం యాపల్‌గూడ బీట్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో హై డెన్సిటీ మిక్స్డ్ ప్లాంటేషన్ విధానంలో భారీ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్‌తో కలిసి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తీర్ణం పెంపుదలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. "పచ్చదనం – ప్రగతికి ప్రణాళిక" నినాదంతో ప్రజలందరూ ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కను వృక్షంగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు.ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి: ఎస్పీ అఖిల్ మహాజన్జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే మానవాళి మనుగడకే ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా మొక్కల పెంపకం, అడవుల రక్షణకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ నిరోష, డీఎస్పీ జీవన్ రెడ్డి, ఎఫ్‌డీఓ అరవింద్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, విద్యార్థులు, అటవీ, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ న్ని కాపాడుకోవడం అం దరి బాధ్యత

## జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్ర య్య

**మంచిర్యాల/జూన్ 5, 2026 (వుదయం ప్రతినిధి)**




పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, ఎ పి ఓ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్, అధికారులతో కలిసి హాజరై స్వచ్ఛ గ్రామం– సురక్షిత జలవాయు పథకంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్రత్యామ్నాయమైన పర్యావరణహిత వస్తువులను వినియోగించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలని తెలిపారు. చెట్లు నాటడమే కాకుండా నీటిని పొదుపుగా వినియోగించాలని, ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలో ఇంకేలా కృషి చేయాలని, ప్లాస్టిక్ కవర్లు, సంచులు, బాటిళ్లు వినియోగించడం వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా పొడి, తడి, శానిటరీ, ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలుగా వేరు చేయడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పవచ్చని, కాలువల శుభ్రత, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పరిశుభ్రత పాటించాలని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతిలో సేంద్రియ వ్యవసాయ సాగు చేయాలని, ఒకే రకమైన పంట కాకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ఆధునిక సాగు పద్ధతులను అనుసరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## పూర్తిస్థాయిలో తరలిస్తాం

### చివరి గింజ వర కు కొనుగోలుస్తాం: ప్రభుత్వ విప్ విజ యరమణారావు

**పెద్దపల్లి, జూన్ 6: (వుదయం కరస్పాండెంట్)**



రైతులు విక్రయించిన వరి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి చివరి గింజ వరకు గోదాములు, రైస్ మిల్లులకు తరలిస్తామని తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు.శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్డులో గల రైస్ మిల్లు గోదాంను పరిశీలించిన ఆయన, కొనుగోలు కేంద్రాల నుంచి తరలించిన ధాన్యం నిల్వలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గోదాంలో నిల్వ చేసిన ధాన్యాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాల నుంచి ఇప్పటికే 98 శాతం ధాన్యాన్ని తరలించినట్లు తెలిపారు. పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో లారీల కొరత, హమాలీల సమస్యల కారణంగా కొంత ధాన్యం మిగిలి ఉందని, దానిని కూడా త్వరితగతిన తరలించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు.లారీ యజమానులు, అధికారులు, పోలీసు శాఖలతో సమన్వయం చేసుకుంటూ ధాన్యం రవాణాను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. హమాలీల కొరత లేకుండా అదనపు కార్మికులను సమీకరించామని, అవసరమైతే రాత్రి వేళల్లో కూడా లోడింగ్ పనులు నిర్వహించి రెండు మూడు రోజుల్లో మిగిలిన ధాన్యాన్ని పూర్తిగా లిఫ్ట్ చేస్తామనిపేర్కొన్నారు. పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, జూలపల్లి మండలాల్లో మిగిలిన ధాన్యాన్ని కూడా రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నా మని వెల్లడించారు. రుతుపవనాలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నియోజకవర్గంలో మక్కల కొనుగోలు కూడా పూర్తిస్థాయిలో చేపట్టామని, కొనుగోలు చేసిన మక్కలను అవసరమైన ప్రాంతాలకు తరలించామని తెలిపారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే కోట్ల రూపాయలు జమ అయ్యాయని, మిగిలిన చెల్లింపులు కూడా త్వరలోనే జమ అవుతాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.ఫోటో రైటప్: పెద్దపల్లి పట్టణంలోని రైస్ మిల్లు గోదాంలో నిల్వ చేసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు.

## ప్రతిభ కనభరిచి క్రీడాకారులకు ప్రోత్సాహం-రామకృ ష్ణాపూర్ ఎస్సై శ్రీధర్

**రామకృష్ణాపూర్, వుదయం:**



రామకృష్ణాపూర్ సింగరేణి స్టేడియంలో జరుగుతున్నటువంటి కరాటే, సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకుంటున్న క్రీడాకారులను స్థానిక ఎస్సై శ్రీధర్ సందర్శించారు.గత నెల జరిగినటువంటి కిక్ బాక్సింగ్ పోటీలలో జిల్లా స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన ఎనిమిది మంది విద్యార్థులను అభినందించి, ప్రోత్సహించడానికి సేఫ్టీ ఎక్విప్మెంట్స్ అందజేశారు. కష్టపడుతున్న క్రీడాకారులకు మేము ఎప్పుడు తోడుంటామని మా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రోత్సహిస్తూ, ఎవరైతే కష్టపడి క్రీడలో రాణిస్తారో వారికి నేను ఎప్పుడు, ఎక్కడ,ఎటువంటి టోర్నమెంట్స్ జరిగిన ఆర్థికంగా వెనుకబడి, టాలెంట్ ఉన్న క్రీడాకారులకు ఆర్థికంగా సహాయం చేయడానికి నా సహకారం ఉంటుందని అని ఎస్సై శ్రీధర్ తెలియజేశారు. ఈ సమాజంలో ప్రస్తుతం కచ్చితంగా తప్పకుండా ప్రతి ఒక్కరు చదువుతోపాటు ఇలాంటి సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకుంటే వారు ఆరోగ్యంతో పాటు ధైర్యం, సెల్ఫ్ కాన్ఫిడెంట్ లెవెల్స్ పెరుగుతాయని అన్నారు.కరాటే మాస్టర్ జుల శ్రీనివాస్ ను ప్రత్యేకంగా అభినందిస్తూ సంతోషం వ్యక్తపరిచారు. ఈ యొక్క కార్యక్రమంలో జూల శ్రీనివాస్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోఆర్డినేటర్ వడివేలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి :

### జపాన్ ప్రజా ప్రతినిధులకు సూ చించిన సిర్పూర్ శాసన సభ్యులు

### డా.పాల్వాయి హరీష్ బాబు

**కాగజ్నగర్ (వుదయం ప్రతినిధి)**



హైదరాబాద్ శాసన మండలి కమిటీ హాల్లో జపాన్ లోని హిరోషిమా రాష్ట్ర ప్రజా ప్రతినిధులు తెలంగాణ శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులతో సమావేశమయ్యారు.ఈ కార్యక్రమం శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జపాన్ సంస్థలు ఎక్కువగా పెట్టుబడులు పెట్టాలని, యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని వ్యవసాయ టెక్నాలజీ మరియు వైద్య రంగాల్లో ఇచ్చిపుచ్చునే ధోరణి కనబరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, పరిగి శాసన సభ్యులు రామ్మోహన్ రెడ్డి, శాసన మండలి సభ్యులు డా. బల్మూర్ వెంకట్, డా. దాసోజు శ్రవణ్, అంజి రెడ్డి, అద్దంకి దయాకర్ మరియు అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత... కలెక్టర్



**జగిత్యాల జూన్ 05 (వుదయం ప్రతినిధి)**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణ కేంద్రంలోని గన్ పార్క్‌లో జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైనహరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ బి సత్య ప్రసాద్ సూచించారు పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న కలెక్టర్ మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి రాజా గౌడ్ జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు..జిల్లా కలెక్టర్

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో సరైన అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలంలోని కొత్తసార్సాలా గ్రామం వద్ద సార్సాలా వాగు నుండి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను నిలిపి అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సరైన అనుమతులు లేకుండా వాగుల నుండి ఇసుకను తరలించడం, చెరువుల నుండి మట్టిని తరలించడం చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేదీ నుండి మన ఇసుక వాహనం యాప్ ప్రారంభించిందని, ఇసుకను తరలించే వారు యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని అనుమతి తీసుకోవాలని, సరైన అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ట్రాక్టర్ల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది:

### రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య.



**నిర్మల్ జిల్లా 5 జూన్ 2026 (వుదయం ప్రతినిధి)**

దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ, దివ్యాంగులు తమ సొంత కాళ్ల మీద నిలబడేలా ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తుందని అన్నారు. దివ్యాంగుల కొరకు రాష్ట్రంలో ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిందన్నారు. 11 వేల దివ్యాంగ పొదుపు సంఘాల్లో దాదాపు 80 వేల మంది దివ్యాంగులు లబ్ధిపొందుతుందన్నారు. దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ విషయంలో ఉన్న కఠిన నిబంధనలు సవరించామని, దీని ద్వారా ఎక్కువ మంది దివ్యాంగులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు దివ్యాంగుల ఆరోగ్యం మెరుగు కోసం బాల భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, దివ్యాంగుల ఉన్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ఈ అవకాశాలు ఉపయోగించుకొని, దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. దివ్యాంగుల కొరకు స్కూటీలు, అడ్వాన్స్డ్ చక్రాల కుర్చీలు, ల్యాప్ టాప్ లు, స్మార్ట్ ఫోన్లు, వినికిడి యంత్రాలు, తదితర పరికరాలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని అన్నారు. వీటి ద్వారా దివ్యాంగులకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన పలువురు దివ్యాంగులకు కార్పొరేషన్ చైర్మన్, కలెక్టర్ లు ల్యాప్ టాప్ లు, స్మార్ట్ ఫోన్ లు, అడ్వాన్స్డ్ చక్రాల కుర్చీలు అందించారు. అనంతరం కలెక్టర్ ప్రాంగణంలో కార్పొరేషన్ చైర్మన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ లు కలిసి 38 మంది దివ్యాంగ లబ్ధిదారులకు ప్రత్యేక స్కూటీలు అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ అధికారి వినూత్న, ఇతర అధికారులు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

**లక్షెట్టిపేట, జూన్ 5 (వుదయం న్యూస్):**



మొక్కలను నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్ రావు

ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని మంచిర్యాల సీనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్ రావు అన్నారు. శుక్ర వారం పట్టణంలోని కోర్టు ఆవరణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు సీనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలను అధిగమించాలంటే విస్తృత స్థాయిలో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ పర్యావరణ రహిత వస్తువులను ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జ్ సాయికిరణ్ కాసమల్ల, బార్ ప్రెసిడెంట్ గోవిందరావు, నంది రవీంద్ర అడిషనల్ పి.పి, బి సంతోష్ ఏజిపి, ఎన్. సత్య గౌడ్ ఎడివి, బి గణేష్, ఎఫ్ఆర్ఓ సంతోష్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సాగరిక, డి ఆర్ వో సునీత, డి ఆర్ వో గోపికృష్ణ, ఎఫ్ ఎస్ ఓ అల్తాఫ్ హుస్సేన్, ఎఫ్ఎస్ఓ శ్రీలత, ఎఫ్ బి ఓ చంద్రశేఖర్, కోర్టు సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యా అవకాశాలపై అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో విస్తృత ప్రచారం



రాయపర్తి జూన్ 5(వుదయం ప్రతినిధి ):ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో కళాశాల అధ్యాపకులు బైరి సుధాకర్ లైబ్రరీ సునీల్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించారు.గ్రామాల్లోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ప్రత్యక్షంగా కలుసుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సదుపాయాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత విద్యా అవకాశాల గురించి వివరించారు.పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని ప్రోత్సహించారు.ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువులకు దూరం కాకుండా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం కూడా అందిస్తున్నట్లు తెలిపారు.అధ్యాపకుల ఇంటింటి ప్రచారానికి తల్లిదండ్రులు, గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధి కోసం అధ్యాపకులు చేపట్టిన ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

### పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలి

### అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకులు కంగాల పాపయ్య



కొత్తగూడ జూన్ 05(వుదయం ప్రతినిధి ):ఆరు గాలం కష్టపడుతూ దేశానికి అన్నం పెడుతున్న రైతుకు నష్టం తెచ్చే విధానాలను మానుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకులు కంగాల పాపయ్య అన్నారు.(ఏ ఐ యూ కె ఏస్ ) కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కల్తీ లేని విత్తనాలను, ఎరువులను పురుగుమందులను రైతాంగానికి అందించాలని, కల్తీ విత్తనాలు అమ్మిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కచ్చితంగా శిక్షించాలని అన్నారు. రైతులకు అవసరమగు పంట రుణాలను సకాలంలో అందించి ప్రైవేట్ అప్పుల బారిన పడకుండా రైతాంగాన్ని కాపాడాలని కోరారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీ పంట గిట్టుబాటు ధర చట్టాన్ని చేసి అమలు చేయాలని, పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని లేదంటే రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళన చేయక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చితారి పాపయ్య, నారాయణరెడ్డి వెంకన్న తదితరులు పాల్గొన్నారు...

# ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్‌కు భరోసా

### పర్యావరణ దినోత్సవ ర్యాలీలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపు.




వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి జూన్ 5.

ప్రకృతి సమస్త జీవరాశులకు జీవనాధారమని, ప్రకృతిని సంరక్షిస్తేనే అది మానవాళిని కాపాడుతుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఓ సిటీ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో వివిధ శాఖల జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ థీమ్ 'ప్రకృతి నుండి ప్రేరణ' సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత వస్తువులను ఉపయోగించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా రోజూ లక్షల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతుండటంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. సునామీలు, క్లౌడ్‌బర్స్ట్‌లు, తీవ్ర వర్షాలు, కరువులు వంటి ప్రకృతి విపత్తులు మానవ జోక్యం వల్ల మరింత అధికమవుతున్నాయని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడకుండా గ్రీన్ హైడ్రోజన్ వంటి పర్యావరణహిత ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పూర్వీకుల జీవన విధానంలో భాగమైన మట్టి కుండలు, మట్టి పాత్రలు వంటి ప్రకృతి అనుకూల వస్తువులను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, సురక్షితమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ర్యాలీ ప్రారంభానికి ముందు కలెక్టర్ పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించి పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. రిటైర్డ్ ఫారెస్ట్ అధికారి పురుషోత్తం మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి స్టీల్ వాటర్ బాటిళ్లను వెంట తీసుకెళ్లే అలవాటు చేసుకుంటే ప్లాస్టిక్ వినియోగం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. ప్లాస్టిక్ నియంత్రణలో ప్రతి వ్యక్తి తన వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు.

అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి మాట్లాడుతూ, మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సునీత పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సునీత, రిటైర్డ్ డీఎఫ్‌వో పురుషోత్తం, పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక కె. పురుషోత్తం, టి. శ్రవణ్ కుమార్, ఎ. సంపత్ కుమార్, వి. శ్రీనివాస్, రాధ, భగవాన్, వెంకన్న సింగర్ యం. వరుష రామయ్యలు, రాజాగోవిందు, దామోదర్, డాక్టర్ సాంబమూర్తి, ఫైజుల్ రెహమాన్ లతో,,పాటు పలు స్వచ్ఛంద సంస్థలు, వాకర్స్, యోగ అసోసియేషన్ ప్రతినిధులు, అటవీశాఖ, హార్టికల్చర్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం పర్యావరణాన్ని కాపాడుట ప్రతి ఒక్కరి బాధ్యత.

### సర్పంచ్ ఆబోతు శ్రీలతఅశోక్ యాదవ్.



ఖానాపురం, జూన్ 5 (వుదయం ప్రతినిధి):మానవ మనుగడుకు మొక్కలే జీవ జీవనాధారం పర్యావరణాన్ని కాపాడుట ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రామ సర్పంచ్ ఆబోతు శ్రీలతఅశోక్ యాదవ్ తెలిపారు. మండలంలోని మనుబోతులగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామ అభివృద్ధిపై పలు విషయాలని గ్రామస్తులతో చర్చించి అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలోని సర్పంచ్ పాలకవర్గం కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రమీల,ఉప సర్పంచ్ గొడుగు రామ, వార్డు సభ్యులు ఆబోతు రవి, మేకల వరదయ్య, గ్రామస్తులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామం వైపు కొండాయిపల్లి అడుగుల

### మిషన్ లైఫ్'లో మహిళల ఆదర్శం



నల్లబెల్లి, జూన్ 5 (వుదయం):పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు సురక్షితమైన భవిష్యత్తు లభిస్తుందని నల్లబెల్లి మండల ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, స్వచ్ఛ గ్రామం సురక్షిత నీరు, గాలి' మిషన్ లైఫ్' కార్యక్రమంలో భాగంగా కొండాయిల్ పల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఎరుకల స్వప్న అధ్యక్షతన శుక్రవారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎరుకల స్వప్న మాట్లాడుతూ. గ్రామంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, గాలి, నేల, నీరు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని కోరారు.

ముఖ్యంగా ఇళ్ల వద్దే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించడం ద్వారా గ్రామాన్ని స్వచ్ఛంగా మార్చుకోవచ్చని ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు. గత సమావేశంలో తీసుకున్న తీర్మానానికి కట్టుబడి, గ్రామంలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కొండాయిల్ పల్లి మహిళలు, పాలకవర్గ సభ్యులు ఒక అడుగు ముందుకు వేశారు. ప్రతి మహిళ తన సొంత నిధులతో బట్ట సంచులను కొనుగోలు చేసి, గ్రామ పంచాయతీ సమక్షంలో పంపిణీ చేసుకున్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బట్ట సంచులను వాడుతూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. కొండాయిపల్లిని స్ఫూర్తిగా తీసుకోవాలి

**ఎంపీడీవో శ్రీనివాసరావు**

మహిళలు సొంత ఖర్చులతో బట్ట సంచులు కొనుగోలు చేసి పంపిణీ చేయడం అభినందనీయమని ఎంపీడీవో శ్రీనివాసరావు కొనియాడారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు కొండాయిల్ పల్లిని స్ఫూర్తిగా తీసుకుని ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చొరవ చూపిన పంచాయతీ కార్యదర్శి రజిత, సర్పంచ్ స్వప్న పాలక వర్గాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రజిత, శ్రీలక్ష్మి, వీఓ సభ్యులు, మహిళలు, వీఓఏ ఆశా కార్యకర్తలు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించిన ప్రిన్సిపాల్ మల్లం నవీన్



వరంగల్ జిల్లా నర్సంపేట వుదయం ప్రతినిధి జూన్ 5.నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని "ప్రకృతిని కాపాడండి -- భవిష్యత్తును సంరక్షించండి" అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణ, వాతావరణ మార్పుల నివారణ, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ అధ్యక్షత వహించగా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డా. కందాల సత్యనారాయణ కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు, నీటి కొరత, అడవుల నరికివేత వంటి తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. జీవవైవిధ్యం భూమిపై జీవుల మనుగడకు అత్యంత అవసరమని, చెట్ల పెంపకం ద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడవచ్చని వివరించారు. పర్యావరణ హిత జీవన విధానాలను అలవర్చుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పుస్తకాలు, పరిశోధన వ్యాసాలు, డిజిటల్ వనరులను అధ్యయనం చేసి శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అకాడమిక్ కోఆర్డినేటర్ డా. కందాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతి వనరుల పరిరక్షణ, నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ వంటి అంశాల్లో యువత చైతన్యవంతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగిన సమాజమే సుస్థిర అభివృద్ధిని సాధించగలదని అన్నారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించడంతో పాటు చెట్ల ప్రాముఖ్యత, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, కార్బన్ ఉద్గారాల నియంత్రణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రకృతి పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఆర్. గణేష్, అధ్యాపకులు గ్లోరి, మాధవి, ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి.**

**భూగర్భ జలాలను పెంపొందించాలి.**

**సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.**

**సంబంధిత శాఖలతో గ్రామసభ.**

**సర్పంచుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్.**



ఖానాపురం, జూన్ 5 (వుదయం ప్రతినిధి):ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి భూగర్భ జలాలను పెంపొందించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ సంబంధిత శాఖల వారికి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలోని ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ లెవెల్ శాఖలతో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్ధాలను వివరిస్తూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని తెలుపుతూ, ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలని పెంపొందించవచ్చునని తెలుపుతూ, వర్షాకాలం సీజన్ సమయమిస్తున్న సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందువస్తుగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు తెలుపుతూ, అన్ని శాఖల సమన్వయంతో పాలకవర్గం సమన్వయతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడమే నా లక్ష్యం అని గ్రామ లెవల్ అన్ని శాఖల అధికారులకు గ్రామ సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఉప సర్పంచ్ ఉప్పు రాజు, వార్డు సభ్యులు గుండ్లపల్లి విజయ్ చలిగంటి మల్లికార్జున్, అజహార్, శాఖమూరి ముఖేష్ చౌదరి, భూక్య ప్రవంతి, గుండ్లపల్లి మంజుల, కామిశెట్టి లక్ష్మి, కందుల రమాదేవి, ఇలాపొంగుల కొమురమ్మ, అంగన్వాడీ టీచర్లు మల్లికాంబ, ఇందిర, నాగమణి, హైమావతి, మానెమ్మ, సిఏలు సునీత, శ్రీదేవి, హంస, భవాని, ఏఎన్ఎం రాగం సునీత, ఆశా కార్యకర్తలు సంధ్య, సునీత, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ నాయకులు.



పరకాల జూన్ 5 (వుదయం ప్రతినిధి): పరకాల మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన పవన్ ని బిఆర్ఎస్ నాయకులు పి ఎ సి ఎస్ డైరెక్టర్ పంచగిరి శ్రీనివాస్ పరకాల వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ నక్క చిరంజీవి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది.పరకాల మున్సిపాలిటీకి గ్రేడ్ వన్ ఆఫీసర్ రావడం ఎంతో సంతోషంగా ఉందని,భవిష్యత్తులో పరకాల పట్టణం అభివృద్ధి జరుగుతుందని ఆశిస్తున్నామని ఇప్పటివరకు ఎక్కువ శాతం ఇన్చార్జిల పాలన వల్ల పరకాలకు నష్టం జరిగిందని పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులలో పారిశుధ్యం మరియు డెవలప్మెంట్ జరిగేలా చూడాలని కోరారు.



# పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా ప్రభుత్వం

### .. కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే...

రాయపర్తి జూన్ 5 (వుదయం ప్రతినిధి): అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా -- సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక చేయూత అందించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ కుటుంబం కూడా తమ కుమార్తెల వివాహాల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. కళ్యాణలక్ష్మి షాది ముబారక్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం వేలాది కుటుంబాలకు ఉపశమనం కలిగిస్తోందని, మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల తహసిల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ , ఇంచార్జ్ ఎంపీడీవో కూచన ప్రకాష్, సర్పంచులు గారే సంహేద్ర బిక్షపతి, తీగల సాయిలు, నాయిని యాకన్న నాగరాజు , పెండ్లి మహేందర్ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గ్రామీణ అభివృద్ధికి మరో అడుగు లింకు రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన



రాయపర్తి జూన్ 5 (వుదయం ప్రతినిధి): మండల కొండూరు గ్రామంలో చేపట్టిన బిటి రోడ్డు నుండి భోజ్యతండా, పోతిరెడ్డిపల్లి నుండి లకావత్ కండకు, బీటీ రోడ్డు నుండి సూర్య తండకు, వీటి రోడ్డు నుండి ఏకే తండకు లో లింకు రోడ్లకు నిర్మాణ పనులకు పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారుల నిర్మాణం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో మండల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడటంతో పాటు రైతులకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు..అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ శ్రీనివాస్, ఇంచార్జి ఎంపీడీవో కూచన ప్రకాష్,బ్లాక్ అధ్యక్షులు జాటోతో హమ్య నాయక్, టిపిసిసి మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి , జక్కుల వెంకటరెడ్డి, ఎండి నహీం, సర్పంచులు రాయిని యాకన్న, సూదుల ఉమాదేవి, పెండ్లి మహేందర్ రెడ్డి, చెవ్వ హేమలత కాశినాదం, పెద్దగోని నాగరాజు, బానిషా, తీగల సాయిలు, కంది కట్ల స్వప్న సంతోష్, సోమ్లా నాయక్, ఐటీడీఏ ఏఈ గూగుల్ శంకర్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు రాకేష్ , అనిల్ ,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు..

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### అవగాహన సదస్సులో సర్పంచ్



వర్ధన్నపేట జూన్ 5 (వుదయం ప్రతినిధి): పర్యావరణాన్ని కాపాడడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని, ప్రకృతి సంరక్షణ ద్వారానే భావితరాలకు సురక్షిత భవిష్యత్తును అందించగలమని సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ పేర్కొన్నారు.స్థానికంగా నిర్వహించిన పర్యావరణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, చెట్ల పెంపకం, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, నీటి వనరుల సంరక్షణ వంటి చర్యల ద్వారా పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం కారణంగా మానవ జీవనంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణలో యువత, విద్యార్థులు ముందుండి ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ప్రకృతి సమతుల్యతను కాపాడడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవేందర్ , గ్రామ కార్యదర్శి షేక్ హుస్సేన్ , వార్డ్ సభ్యులు ,ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎంత తిన్నా నీరసమేనా!?



ఉదయాన్నే ఉత్సాహంగానే లేస్తాం..వేళకు టిఫిన్ తింటాం... మధ్యాహ్నం భోజనం చేస్తాం... అయినా మనలో కొంత మందికి అలసట, నీరసంగా అనిపిస్తుంది. దానికి అసలు కారణమేంటో తెలుసా! రోజుకి మూడు పూటలా తింటున్నా మన ఒంటికి సరిపడా పోషకాలు అందుతున్నాయా? అంటే లేదనే చెబుతున్నారు పోషకాహార నిపుణులు. కారణం మనం తినే కొన్ని ఆహార పదార్థాలు త్వరగా మన ఎనర్జీని కోల్పోయేలా చేస్తాయట. దానివల్లే ఈ పరిణామాలన్నీ అంటున్నారు. ఆకలి అనిపిస్తే కిచెన్‌వైపు వెళ్లడం మానేసి, ఫోన్‌లో స్విగ్గీ, జొమాటో యాప్‌ల్ని ఓపెన్ చేసి ఇష్టమైన ఫుడ్ ఆర్డర్ పెట్టేస్తాం. ఇంకేం నిమిషాల వ్యవధిలో మన ముందు ఫుడ్ ఉంటుంది. ఎప్పుడైనా ఒక్కసారి ఆలోచించారా? ఇలా ఆర్డర్ చేయగానే అలా వచ్చేస్తోందంటే అది ఎప్పుడు వండి ఉంటారో అని. పోనీ అందులో మనకు ఆరోగ్యకరమైన ఆహారం పెట్టుకుంటామా అంటే అదీ లేదు. పిజ్జాలు, బర్గర్‌లనే ఎంచుకుంటాం. వాటితో ఆ క్షణానికి ఆకలి తీరుతుంది. కారణం వాటిలో ఉండే అదనపు చక్కెరలు, ప్రిజర్వేటివ్స్ తక్షణ శక్తినిస్తాయి. కానీ శరీరానికి కావాల్సిన శక్తిని అందించవు.

సాధారణంగా పండ్ల కంటే పండ్ల రసాల్నే ఇష్టపడతారు చాలామంది. ఇవి ఆరోగ్యానికి మంచివే కానీ, శారీరక శక్తిని త్వరగా కోల్పోయేలా చేస్తాయి. ఫైబర్ మనం తీసుకునే ఆహారంలోని చక్కెరలను నెమ్మదిగా శరీరంలోకి విడుదలయ్యేలా చేస్తుంది. పండ్ల ద్వారా లభించే పీచు పండ్ల రసాల్లో ఉండదు. పైగా చక్కెర స్థాయిలు కూడా ఎక్కువగా ఉంటాయి. వీటిని మనం తీసుకున్నప్పుడు రక్తంలో షుగర్ లెవల్స్ ఒక్కసారిగా పెరిగి, అంతే వేగంగా తగ్గుతాయి. దాంతో అలసట ఆవరిస్తుంది.

కాఫీ, టీ లేనిదే రోజు మొదలవదు... ఉత్సాహంగా పని చేయలేం ఈ మాటలు మన చుట్టూ ఎవరో ఒకరి నుంచి వింటూనే ఉంటాం. వీటిలో ఉండే కెఫిన్ తక్షణ శక్తిని ఇస్తుంది. కానీ రోజులో ఎక్కువసార్లు వీటిని తీసుకోవడం వల్ల శరీరంలోని సహజ శక్తి స్థాయిలపై ప్రతికూల ప్రభావం పడుతుందంటున్నారు న్యూట్రిషనిస్టులు. వీటితో పాటు తీసుకునే బేకరీ పదార్థాలు... షుగర్, మైదాలతో తయారయ్యేవే. వీటిని మోతాదుకి మించకుండా చూసుకోమని హెచ్చరిస్తున్నారు. తక్షణ శక్తినిచ్చే ఎనర్జీ డ్రింక్స్ శరీరానికి తాత్కాలిక సత్తువనిచ్చినా... వీటిలో వాడే కృత్రిమ చక్కెరలు ఎక్కువసేపు నిల్వ ఉండవు. పైగా జీవక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. అందుకే నేటి యవతలో విటమిన్ డి, బి12, ఐరన్ లోపాలు విపరీతంగా పెరుగుతున్నాయి. దాంతో అలసట ఆవరిస్తోంది. నిజానికి పోషకాహార లోపం శరీరాన్ని మాత్రమే కాదు, ఏకాగ్రతనీ దెబ్బతీస్తుంది. నిద్రలేమిని పెంచుతుంది. మూడ్ స్వింగ్స్‌కి కారణం అవుతుంది. ప్లేట్ నిండా ఏది పడితే అది తినే కంటే శరీరానికి రోజంతా శక్తిని అందించే తాజా పండ్లు, కూరగాయలు, నట్స్, కోడి గుడ్లు, పాలు, పాల పదార్థాలు, చేపలు, పప్పు దినుసులు వంటివి తీసుకోవాలని చెబుతున్నారు నిపుణులు. పాటిస్తారుగా మరి!

# ఎండల్లో మాధుర్యం!



వేసవిలో మామిడిపండ్లు మనల్ని మహా ఊరిస్తాయి కదూ! వీటితో అప్పటికప్పుడు జ్యూస్ చేసి తాగటం సరే.. ఇవి విస్తారంగా దొరికే ఈ సీజన్‌లో కాన్సన్ట్రేట్ డ్రింక్ తయారు చేసుకుంటే.. ఎంచక్కా చల్లటి నీళ్లలో కలిపి ఎండల్లో సేద తీరవచ్చు. కావలసినవి: మామిడిపండ్లు – 4, పంచదార – నాలుగు కప్పులు, నిమ్మరసం – రెండు టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి – పావు స్పూన్, నీళ్లు – ఒకటిన్నర కప్పులు, తయారీ: మామిడిపండ్లను శుభ్రంగా కడిగి చెక్కు తీసి ముక్కలు కోయాలి. వాటిని జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. అడుగుభాగం మందంగా ఉన్న గిన్నెలో నీళ్లు, పంచదార వేసి వేడిచేయాలి. పంచదార కరిగిన తర్వాత మామిడి గుజ్జు వేసి కలియతిప్పుతూ ఉడికించాలి. చివర్లో నిమ్మరసం, యాలకుల పొడి వేసి సెగ తీసేయాలి. ఈ చిక్కటి పానీయం పూర్తిగా చల్లారిన తర్వాత గాలి చొరబడని గాజు సీసాలోకి తీసి భద్రం చేసుకోవాలి. తాగదలచినప్పుడు.. గ్లాసు నీళ్లలో రెండు స్పూన్లు కాన్సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. ఈ కొలతల ప్రకారం ఇంకా ఎక్కువ పరిమాణంలోనూ చేసుకోవచ్చు. సులభంగా చేసుకో దగ్గ ఈ పానీయాన్ని ఒకసారి ప్రయత్నించి చూడండి. రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే సుమారు రెండు నెలలు నిల్వ ఉంటుంది.

# నిద్ర లేవగానే.. ఈ పొరపాట్లు వద్దు!

ఉదయం లేవగానే టీ, కాఫీ తాగడం.. సమయం లేదని బ్రేక్‌ఫాస్ట్ తినకుండానే ఆఫీసుకి వెళ్లడం.. వంటివి చేస్తుంటారు కొందరు. అయితే వీటివల్ల వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని చెబుతున్నారు నిపుణులు. కాబట్టి ఉదయం లేవగానే చేసే కొన్ని చిన్న చిన్న పొరపాట్లేంటో తెలుసుకుని, వాటిని సరిదిద్దుకుంటే మంచి జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు రోజంతా ఉత్సాహంగా ఉండచ్చంటున్నారు నిపుణులు. కొంతమంది ఉదయం నిద్ర లేచేటప్పుడు వెల్లకిలా పడుకొని అదే పొజిషన్‌లో గబుక్కున లేచి కూర్చుంటారు. కానీ అలా లేవడం వల్ల బిగుసుకుపోయిన కండరాల్లో నొప్పి వచ్చే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. కాబట్టి ఉదయం లేచేటప్పుడు కుడిపక్కకు తిరిగి నెమ్మదిగా లేవడం మంచిది. ఆపై కాస్త అటూ ఇటూ కదలడం వల్ల రాత్రంతా నిశ్చలంగా ఉన్న శరీర భాగాలకు రక్తప్రసరణ మెరుగవుతుందట. ఇదే రోజంతా మనల్ని ఉత్సాహంగా ఉంచుతుందట. కొంతమంది ఉదయం త్వరగానే నిద్ర లేచినా ఆఫీసు టైం వరకు ఏదో ఒక పని చేస్తూ ఆఖరి క్షణాల్లో కంగారుగా రడీ అవుతుంటారు. ఫలితంగా మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. కాబట్టి ఇలా జరగకుండా.. ఆ రోజుకు కావాల్సిన కాయగూరలు తరుక్కోవడం, ఆఫీసుకి వేసుకునే డ్రస్ తీసి పెట్టుకోవడం.. వంటి పనుల్ని ముందు రోజు రాత్రే చేసుకోవాలి. ఫలితంగా మరుసటి రోజు ఉదయం ఎలాంటి టెన్షన్ లేకుండా ప్రశాంతంగా నిద్ర లేవడానికి, పనులు ముగించుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఆఫీస్‌కు టైమవుతోందని చాలామంది బ్రేక్‌ఫాస్ట్ తినడం కూడా మానేస్తుంటారు కొందరు. ఈ అలవాటు దీర్ఘకాలంలో రోగనిరోధక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు.. స్థూలకాయం, మధుమేహం.. వంటి సమస్యలు తెచ్చి పెట్టే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఉదయం లేచిన దగ్గర్నుంచి సమయాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటే బ్రేక్‌ఫాస్ట్‌కూ సమయం సరిపోతుందంటున్నారు.



ఉదయం లేవగానే చేసే మరో పెద్ద పొరపాటేంటంటే.. మొబైల్ చెక్ చేసుకోవడం, కాల్స్ మాట్లాడడం, చాటింగ్ చేయడం.. ఈ క్రమంలో ప్రతికూల సమాచారం కంట పడితే మూడ్ మొత్తం అప్‌సెట్ అవుతుంది. ఇది కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి అత్యవసర కాల్స్, మెసేజెస్ చేసే పనుంటే తప్ప ఉదయం లేవగానే మొబైల్స్ జోలికి వెళ్లకపోవడం మంచిది. దీనికి బదులుగా ఉదయం లేవగానే కాసేపు పుస్తకం చదవడం అలవాటు చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల మనకు తెలియని ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. ఉదయాన్నే చేసే వ్యాయామం రోజంతటికీ కావాల్సిన శక్తిని, ఉత్సాహాన్ని అందిస్తుంది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. ఉదయం లేవగానే కొంతమంది అధిక బరువులెత్తడం, ఇతర కఠినమైన వ్యాయామాలు చేయడం.. వంటివి చేస్తుంటారు. ఇవి కండరాల ఆరోగ్యానికి అంత మంచివి కావు. ఎందుకంటే రాత్రి నిద్రపోయే సమయంలో శరీరంలో పెద్దగా కదలికలు లేకపోవడంతో ఉదయం లేచే సమయానికి కండరాలు, ఎముకలు బిగుసుకుపోతాయి. కాబట్టి వీటిని వెంటవెంటనే కదిలించడం, ఒకేసారి ఎక్కువ బరువులెత్తడం, కఠినమైన వ్యాయామాలు చేయడం కాకుండా.. నెమ్మదిగా కదిలించే ప్రయత్నం చేయాలి. ఇందుకోసం వ్యాయామానికి ముందు కాసేపు వార్మప్ చేయడం, యోగా, ధ్యానం.. వంటివి చేయడం మంచిది. దీంతో కండరాలు రిలాక్సయ్యే అవకాశం ఉంటుంది. ఆపై అసలైన వ్యాయామ రొటీన్‌ని పాటించవచ్చని సూచిస్తున్నారు నిపుణులు.

# చక్కని ఆరోగ్యం

# నోటి దుర్వాసన నలుగుట్లో ఇబ్బంది పెడుతోందా..

కొబ్బరిపాల (కొబ్బరిని కోరి మెత్తగా రుబ్బి పిండితే వచ్చే రసం) లో తగినంత పచ్చ కర్పూరం వేసుకొని తాగాలి. ఈ కొబ్బరి పాలను పచ్చిగా అయినా తాగవచ్చు, వేడి చేసుకుని అయినా తాగవచ్చు. ఇలా తరచూ చేయడంవల్ల నోటి దుర్వాసన తగ్గుతుంది. అదేవిధంగా గజ నిమ్మకాయ (దబ్బ నిమ్మకాయ) ను ముందు నాలుగు ముక్కలుగా కోయాలి. ఆ తర్వాత దాన్ని చిన్న ముక్కులుగా తరుగుకుని, ఒక్కో ముక్కను దవడకు వేసుకుని చప్పరిస్తే నోరు శుభ్రపడుతుంది. తద్వారా నోటి



దుర్వాసన తగ్గుతుంది. జాజికాయ, జాపత్రీ, పచ్చ కర్పూరం కొద్దికొద్దిగా తీసుకొని దంచుకోవాలి. అనంతరం ఆ పొడిని ఎండుద్రాక్షలతో కలిపి నూరాలి. ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న గోళీల్లా చుట్టుకుని, ఒక్కో గోళిని దవడకు పెట్టుకొని చప్పరిస్తుండాలి. దాంతో క్రమంగా నోటి దుర్వాసన నుంచి ఉపశమనం లభిస్తుంది. తరచూ దాల్చిన చెక్క చిన్నముక్కను తీసుకుని దవడకు పెట్టుకుని నములుతుంటే కూడా నోరు శుభ్రంగా పడుతుంది. ఫలితంగా నోటి దుర్వాసన నుంచి ఉపశమనం కలుగుతుంది. తమలపాకులు కూడా నోటి దుర్వాసనను పోగొట్టడంలో తోడ్పడుతాయి. ఇవి నాలుకమీద జిగురును హరిస్తాయి. తమలపాకుపై పచ్చకర్పూరం వేసిన కిళ్లీ తింటే నోటిలో మంచి సువాసన వస్తుంది.

# చేతి వేళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే..

చేతులు, వేళ్లలో రక్త ప్రసరణ సక్రమంగా ఉండడం ఎంతో అవసరం. ఇది వాటి బలం, వశ్యత, రోజువారీ పనితీరుకు ఎంతో అవసరం. రక్తం సరైన విధంగా ప్రసరిస్తే కండరాలు, కీళ్లు, కణజాలాలకు అవసరమైన ఆక్సిజన్, పోషకాలు అందుతాయి. అయితే ఎక్కువసేపు ఒకే స్థితిలో ఉండటం, నిరంతరం ఒకే రకమైన పనులు చేయడం, చల్లని వాతావరణం వంటి కారణాల వల్ల రక్త ప్రసరణ తగ్గి చేతుల్లో బిగుతు, మొద్దుబారడం లేదా అసౌకర్యం కలుగుతుంది. అలాంటి సమస్యలను తగ్గించేందుకు కొన్ని సులభమైన చేతి, వేళ్ల వ్యాయామాలు ఉపయోగపడతాయి. ఇవి రక్త ప్రసరణను మెరుగుపరచడమే కాకుండా చేతుల చురుకుదనాన్ని, సౌకర్యాన్ని పెంచడంలో సహాయపడతాయి. ప్రత్యేక పరికరాలు అవసరం లేకుండా ఇంట్లోనూ, కార్యాలయంలోనూ, విరామ సమయంలోనూ వీటిని చేయవచ్చు. వేళ్లను చాపడం అత్యంత సులభమైన వ్యాయామాల్లో ఒకటి. చేతిని బల్లపై ఉంచి లేదా ముందుకు చాచి, వేళ్లను మెల్లగా వీలైనంత వరకు నిటారుగా చాపాలి. 10 నుంచి 15 సెకన్ల పాటు ఆ స్థితిలో ఉంచి మళ్లీ సడలించాలి. ఈ వ్యాయామం వేళ్లలో రక్త ప్రవాహాన్ని పెంచి బిగుతును తగ్గించడంలో సహాయపడుతుంది. కంప్యూటర్‌పై ఎక్కువసేపు టైపింగ్ చేసే వారు లేదా మొబైల్ ఎక్కువగా ఉపయోగించే వారికి ఇది ప్రత్యేకంగా ఉపయోగకరంగా ఉంటుంది. చేతిని పిడికిలిగా బిగించడం కూడా రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. మొదట వేళ్లను నిటారుగా ఉంచి, తర్వాత నెమ్మదిగా లోపలికి మడిచి పిడికిలి చేయాలి. కొన్ని సెకన్ల తర్వాత చేతిని పూర్తిగా తెరవాలి. ఈ కదలికను పలుమార్లు చేయడం వల్ల వేళ్లలోని చిన్న రక్తనాళాల ద్వారా రక్త ప్రవాహం మెరుగుపడుతుంది. అలాగే కీళ్ల చలనం, చేతి బలం కూడా పెరుగుతాయి. వేళ్లతో ట్యాపింగ్ చేయడం ఎక్కడైనా సులభంగా చేయగలిగే వ్యాయామం. బొటనవేలిని ఒక్కో వేలు చివరికి తాకిస్తూ O ఆకారాన్ని రూపొందించాలి. ఈ కదలిక వేళ్ల కీళ్లను చురుకుగా ఉంచి రక్త ప్రసరణను ప్రోత్సహిస్తుంది. అంతేకాకుండా చేతి సమన్వయాన్ని మెరుగుపరచి రోజువారీ పనులను సులభతరం చేస్తుంది. మణికట్టులను వృత్తాకారంలో తిప్పడం కూడా ప్రయోజనకరం. చేతులను ముందుకు చాచి మణికట్టులను ఒక దిశలో 10 సెకన్ల పాటు తిప్పి, తర్వాత వ్యతిరేక దిశలో తిప్పాలి. ఇది మణికట్టు చుట్టూ ఉన్న కండరాలను సడలించి చేతులకు రక్త ప్రసరణను పెంచుతుంది.



# నువ్వులు దివ్యౌషధం..

నువ్వులు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నువ్వులలో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, విటమిన్‌లు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియంతోపాటు ఇతర యాంటీ ఆక్సిడెంట్లు



పుష్కలంగా ఉంటాయి. అందువల్ల నువ్వులను క్రమం తప్పకుండా తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మధుమేహాన్ని అదుపులో ఉంచడంలో.. చెడు కొలెస్ట్రరాల్‌ను కరిగించి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో.. ఎముకలను పటిష్టం చేయడంలో.. జీర్ణవ్యవస్థ, మెదడు పనితీరును మెరుగుపర్చడంలో.. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో నువ్వులు కీలకపాత్ర పోషిస్తాయి. ఈ ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం..నువ్వులలో పీచు పుష్కలంగా ఉంటుంది. కాబట్టి నువ్వులను తీసుకోవడంవల్ల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు నువ్వులు చాలా మంచిది. నువ్వులు తింటే గుండె ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. వీటిలోని 'ఒలియిక్ యాసిడ్', 'లినోలిక్ యాసిడ్' వంటివి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. నువ్వులు ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. నువ్వులలో ఉండే అధిక కాల్షియం ఎముకల బలోపేతానికి తోడ్పడుతుంది. ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధులతో పోరాడేందుకు నువ్వులను తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. నువ్వులు మన జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో కూడా చాలా మేలు చేస్తాయి. నువ్వులలోని అధిక పీచు అరుగుదలకు తోడ్పడుతుంది. మలబద్ధకం వంటి జీర్ణ సమస్యల నుంచి బయటపడటానికి నువ్వులు దివ్యౌషధంగా పని చేస్తాయి.

# స్మార్ట్‌గా పరిగెత్తండి



ఉదయం నిద్రలేవగానే మనల్ని పలకరించే తొలి నేస్తం స్మార్ట్ ఫోన్. వాట్సాప్, ఫేస్‌బుక్ , ఇన్‌స్టాగ్రామ్ చూడటానికి మాత్రమే కాకుండా ఈ స్మార్ట్‌ఫోన్.. మన ఆరోగ్యాన్ని శాసించే ఒక అద్భుతమైన పరికరమని చాలామందికి తెలియదు. మన శరీరాన్ని మెరుగుపరుచుకోవడం కోసం మనం జిమ్‌కోచ్ కోసమో, డైటీషియన్ అపాయింట్ కోసమో చూడాల్సిన పనిలేదు. మన జేబులో ఉండే స్మార్ట్ ఫోనే మనల్నీ పరిగెత్తిస్తుంది. మనం ఏం తినాలో చెబుతుంది.. చివరికి మనం ఎంతసేపు నిద్రపోవాలో కూడా డిసైడ్ చేస్తుందని ఇటీవల ఓ అధ్యయనం సైతం పేర్కొంది. యాక్టివిటీ ట్రాకింగ్: మన ఫోన్‌లో ఉండే యాక్సిలరోమీటర్ అనే సెన్సర్ సాయంతో మనం నడవడం, మెట్లు ఎకడం, పరిగెత్తడం వంటి పనులను గుర్తించి ఆ డేటాను మనకు అర్థమయ్యే విధంగా మారుస్తుంది. అలాగే మనం ఎంత దూరం ప్రయాణించాం? ఏ మార్గంలో వెళ్లామో ఇది మ్యాప్ రూపంలో చూపుతుంది. ఇందులో అడుగుల లెకింపు, క్యాలరీల ఖర్చు, దూరం, యాక్టివ్ టైమ్ లాంటివన్నీ గమనించవచ్చు. పర్సనల్ వరౌట్ కోసం: ఇది మన శరీర తత్వం, బరువు, ఎత్తు, మన ఆరోగ్య లక్ష్యాలను బట్టి మనకు సరిపోయే వ్యాయామాలను రూపొందించే ఒక డిజిటల్ సిస్టమ్. ఇది మన సామర్థ్యాలను బట్టి వ్యాయామాలను సూచిస్తూ మనల్ని గైడ్ చేస్తుంది. డైట్ ట్రాకింగ్: మనం ప్రతిరోజూ తీసుకునే అల్పాహారం, లంచ్, స్నాక్స్, డిన్నర్‌లో ఉండే క్యాలరీలను, పోషకాలను లెకగట్టడమే ఈ డైట్ ట్రాకింగ్. మన లక్ష్యం ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండటమైనా మనం తీసుకునే ఆహారంపై అవగాహన ముఖ్యం. ఇది క్యాలరీల లెకింపు, మాక్రో న్యూట్రియెంట్స్‌ని విశ్లేషణ చేస్తుంది. దీనివల్ల మనం మైండ్‌ఫుల్ ఈటింగ్ అలవాటు చేసుకుంటాం. స్లీప్ అనాలసిస్: ఆరోగ్యకరమైన జీవితానికి సరైన ఆహారం, వ్యాయామం ఎంత ముఖ్యమో నాణ్యమైన నిద్రకూడా అంతే ముఖ్యం. మనం రాత్రి పడుకున్నప్పటి నుంచి ఉదయం నిద్ర లేచే వరకు మన శరీరం ఏ స్థితిలో ఉంది, మధ్యలో ఎన్నిసార్లు మెలకువ వచ్చింది, ఎంతసేపు గాఢనిద్రలో ఉన్నాం.. తదితర వివరాలన్నిటినీ అనాలిస్ చేసి డేటాను అందిస్తుంది. సాధారణంగా మనం చేసే ఏ పనిలోనైనా విజయం సాధించాలంటే మనం ఎంత వరకు సాధించామో తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యం. ఈ ఫిట్‌నెస్ ప్రయాణంలో కూడా అంతే.


# ఆనె పరిగెతో లాభాలెన్నో!

ఈ అడవి పండుకు ఇంగ్లీష్ పేరు: వైల్డ్ జుజుబె. తెలుగు పేర్లు: గొట్టె తీగ, పిండి పరిఘుము, ఆనె పరిగె, తెల్ల పరిగె. అస్సామీస్: బిధావో భోగారి, బోన్ బాగరి, బోన్ బొగోరి, డిండవో బోగన్. ఒరియా: తినకోలి. కన్నడ: కట్టిలండల్, బేలహదు, బిళీ ముళ్ళి హను, కనిక, కొట్ట ముల్లుహణ్ణు. గుజరాతీ: తోరన్. తమిళం: కట్టిలండల్, తోతరి, తోటన. మలయాళం: జాలి, కొట్టముళ్ళు, తొడలి, తుటరి, మలంతుటలీ. మరాఠీ: తురన్, తోరణ. హిందీ: చూర్ణ, సూరన్. సంస్కృతం: ఘంటా అని పిలుస్తారు. ప్రాంతాలను బట్టి ఉచ్చారణలో కొంత తేడా ఉంటుంది. ఇది జిట్ట రేగు కుటుంబానికి చెందినది. దీనికి కూడా ముండ్లు కురచగా జంటగా కానీ ఒంటరిగా కానీ ఉంటాయి. తెల్ల పరిగె దాదాపు 5–7 మీటర్లు ఎత్తు వరకు పెరుగుతుంది. మానుకు దగ్గరలో వేరే చెట్టు ఉంటే దాని సహాయంతో తీగలా కూడా పెరుగుతుంది. రేగు చెట్టులా ఇది కూడా ఆకులు రాల్చుతుంది. పండ్లు తెల్లగా ఉండి, అడుగు భాగాన కొద్ది నాటి కాషాయం రంగు ఉంటుంది. పండ్లు తెల్లగా ఉన్నందున దీనికి చెంచులు 'తెల్ల పరిగె' లేక ఆనె పరిగె అని పిలుస్తారు. థాయిలాండ్‌లో దీని ఉనికి ఎక్కువగా ఉంది. ఇండియా, చైనా, మయన్మార్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక, బాంగ్లాదేశ్ తదితర దేశాల్లోని ఉష్ణ మండల అడవుల్లో పెరుగుతుంటాయి. భారతదేశంలో మాత్రం ఉత్తర ప్రదేశ్, బీహార్, వెస్ట్ బెంగాల్, అస్సాం, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్–నికోబార్ దీవుల్లో ఈ చెట్లు ఉన్నాయి. తెలంగాణలోని నల్లమల అడవులలో అక్కడక్కడా ఉన్నాయి. ముఖ్యంగా మల్లాపూర్, కుడిచింత బయలు మొదలగు ప్రాంతాలలో గమనించవచ్చు. అక్కడి చెంచుల అభిప్రాయం మేరకు ఈ చెట్లు చాలా వరకు కనుమరుగవుతున్నాయి. వీటిని అభివృద్ధి పరిచే అవసరం ఎంతైనా ఉంది.పండ్లు తెలుపు రంగులో ఆకర్షణీయంగా ఉంటాయి. పండులో గుజ్జు కొంత వరకు పిండిగా ఉండి రుచికరంగా ఉండటం వలన చెంచులు ఈ పండ్లను బాగా ఇష్ట పడుతారు. జీవాలు వీటి ఆకులను బాగా ఇష్టపడతాయి. పంటపొలం చుట్టూ తెల్లపరిగె కొమ్మలను కంచెగా వేసుకొని పశువులు ఇతర జంతువుల నుండి పంటను కాపాడుకోవచ్చు. రాలిన పండ్లను ఉడుతలు, కుందేళ్లు ఇతర జంతువులు ఇష్టంగా తింటాయని చెంచులు అన్నారు. చెంచులు, ఇతరులు అనేక రోగాలను నయం చేయటానికి వాడుతారు. ముఖ్యంగా విరేచనాలు, అల్సర్లు, చర్మ వ్యాధులు, దగ్గు, రక్తపోటు మొదలైన వాటికి వాడతారు. ఈ పండులో ఉన్న ఔషధ, పోషక గుణాలు ఉన్నందు వల్ల పోషక లోపాలను కొంతవరకు అరికట్టవచ్చు. ఆ పండ్లలో కూడా ఇతర పంటల్లో మాదిరిగానే చక్కెర, కొవ్వు, పీచు మొదలైన పదార్థాలు ఉంటాయి. పోషకాల విశ్లేషణ ఈ పట్టికలో పొందుపరిచాం... పండ్లు: మార్చ్ – ఏప్రిల్ నెలలోకాస్తాయి. 5–7 మీటర్ల ఎత్తు పెరుగుతుంది.



# చంకల్లో నలుపు.. తగ్గాలంటే..!

వ్యక్తిగత శుభ్రత పాటించినా సరే.. కొంతమందికి చంకల్లో నలుపుదనం ఏర్పడుతుంటుంది. అయితే ఆ నలుపుని తరిమికొట్టడానికి ప్రస్తుతం కొన్ని రకాల క్రీములు, చికిత్సలు అందుబాటులో ఉన్నా.. కొన్ని సహజ చిట్కాలు సైతం పని చేస్తాయంటున్నారు నిపుణులు. ఒక గిన్నెలో రెండు చెంచాల బ్రౌన్ షుగర్ లేదా చక్కెర వేసి అందులో ఒక నిమ్మచెక్కను పిండి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని అండర్ ఆర్మ్స్‌కు అప్లై చేసి పది నిమిషాల పాటు ఆరనివ్వాలి. అలా పూర్తిగా ఆరాక రెండు నిమిషాల పాటు నెమ్మదిగా రుద్ది ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే సరి. చక్కెర




స్క్రబ్‌లా పనిచేసి నలుపును తగ్గిస్తుందంటున్నారు నిపుణులు. కీరా ముక్కలను సన్నగా కట్ చేసి చంకల కింద నల్లగా ఉన్న ప్రాంతంలో ఐదు నిమిషాల పాటు రుద్దాలి. తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకోవాలి. రోజూ స్నానానికి వెళ్లేముందు కీరా ముక్కలతో ఆ ప్రాంతంలో క్రమం తప్పకుండా రుద్దుకుంటే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. గుప్పెడు వేపాకులు తీసుకుని వాటిని మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. ఇప్పుడు అందులో ఒక చెంచా పసుపు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని నల్లగా ఉన్న ప్రాంతంలో రాసి 15 నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకోవాలి. వేప, పసుపు.. ఈ రెండింటిలో ఉండే యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాల వల్ల చంకల్లో ఏర్పడిన బ్యాక్టీరియా తగ్గడమే కాకుండా నలుపుదనం కూడా క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అయితే ఈ చిట్కాలు సహజసిద్ధమైనవే అయినప్పటికీ.. చర్మతత్వానికి సరిపడతాయో లేదో తెలుసుకోవడానికి ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## ఓటీపీ లేకుండానే మెటా యాప్స్ లాగిన్

వొడాఫోన్ ఐడియా (వీఐఎల్) తన చందాదారుల కోసం మెటా సామాజిక మాధ్యమాలు – వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలకు 'సైలెంట్ మొబైల్ వెరిఫికేషన్' సదుపాయాన్ని తీసుకొచ్చింది. దీంతో ఈ నెట్‌వర్క్ చందాదారులు, ఇకపై పాస్‌వర్డ్/ఓటీపీ అవసరం లేకుండానే సులభంగా ఈ ఖాతాల్లో లాగిన్ కావొచ్చు. సైలెంట్ మొబైల్ వెరిఫికేషన్ పూర్తిగా సురక్షితమైన, నెట్‌వర్క్ ఆధారిత ధ్రువీకరణ చేసే సాంకేతికత అని వీఐఎల్ తెలిపింది. ఆయా యాప్‌లు మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న వినియోగదారులు.. వాటిని ఆరంభించేందుకు తమ మొబైల్ నంబర్‌ను మాన్యువల్‌గా ఎంటర్ చేయాల్సిన అవసరం ఉండదు. ఆ యాప్ నుంచి ధ్రువీకరణ కోసం ఓటీపీ కోసం వేచిచూడాల్సిన పని లేకుండా, బ్యాక్‌గ్రౌండ్‌లోనే మొబైల్ నంబర్‌ను ధ్రువీకరిస్తుంది.




# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్‌మార్కెట్ సూచీలు



దేశీయ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి (Stock Market Today). అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు, ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ ప్రకటించిన నేపథ్యంలో మన సూచీల్లో ఊగిసలాట కనిపించింది. ఐటీ, మెటల్ సెక్టార్ల షేర్లు నష్టపోయాయి. ఉదయం సెన్సెక్స్ 74,629 వద్ద ప్రారంభమైంది. క్రితం ముగింపుతో పోలిస్తే మార్కెట్ లాభాల్లోనే ప్రారంభమైంది. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ ప్రకటన తర్వాత మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 116 పాయింట్ల నష్టంతో 74,243 వద్ద ముగియగా.. నిఫ్టీ 49 పాయింట్ల నష్టంతో 23,366 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.94 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ సూచీలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌యూఎల్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు రాణించాయి. హిందాల్కో, విప్రో, ట్రెంట్, కోల్ ఇండియా, టీసీఎస్ షేర్లు నష్టపోయాయి. రూపాయిని బలోపేతం చేసేలా దేశంలోకి డాలర్ల రూపంలో పెట్టుబడులు రప్పించే ఉద్దేశంతో కేంద్రం ఎల్‌టీసీజీ పన్నును తొలగించింది. అదే సమయంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నామని, రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నామని ఆర్‌బీఐ వెల్లడించింది. దీంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు ఒత్తిడికి గురయ్యాయి.

## భారత్‌లో డేటా సెంటర్ల ఏర్పాటుకు ఎయిర్‌ట్రంక్ పెట్టుబడి


బ్లాక్ స్టోన్, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్‌కు చెందిన ఎయిర్‌ట్రంక్ సంస్థ (AirTrunk) భారత్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. దేశంలో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన కోసం భారీ పెట్టుబడిని ప్రకటించింది. భారత్‌లో డేటా సెంటర్ల ఏర్పాటు కోసం 30 బిలియన్ డాలర్లు (సుమారు రూ.3 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. 2030 నాటికి 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లను అభివృద్ధి చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

ఎయిర్‌ట్రంక్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాబిన్ ఖుదా భారత్ పర్యటన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ వంటి అంశాల్లో ఇలాంటి పెట్టుబడులు భారత్‌ను గ్లోబల్ హబ్‌గా నిలుపుతాయని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. భారతదేశాన్ని గ్లోబల్ ఏఐ పవర్‌హౌస్‌గా మార్చాలనే ప్రధాని విజన్‌కు ఈ పెట్టుబడి మద్దతుగా నిలుస్తుందని రాబిన్ ఖుదా పేర్కొన్నారు. ఈ పెట్టుబడి వల్ల స్థానికంగా వేలాది మందికి ఉద్యోగ,



ఉపాధి అవకాశాలు లభిస్తాయని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. రహదారులు, పోర్టులు, పవర్ నెట్‌వర్కులు ఏవిధంగా దేశ ఆర్థిక వృద్ధికి అవసరమో.. డిజిటల్ మౌలికవసతులు కూడా అంతే అవసరమని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది.

## విదేశీ ఇన్వెస్టర్లకు కేంద్రం గుడ్‌న్యూస్



దేశీయ స్టాక్ మార్కెట్ నుంచి పెద్దఎత్తున విదేశీ మదుపర్లు తరలిపోతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోకి డాలర్ల రూపంలో పెట్టుబడులు రప్పించే ఉద్దేశంతో ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ సంస్థాగత మదుపర్లు (FII) చేసే పెట్టుబడులపై దీర్ఘకాల మూలధన లాభాల (LTCG) పన్నును తొలగించింది. ఈ మేరకు శుక్రవారం ఆర్డినెన్స్ జారీ చేసింది. దీర్ఘకాలిక పెట్టుబడులను ఆకర్షించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది.

ఈ ఏడాదిలో ఇప్పటివరకు మన ఈక్విటీ మార్కెట్ నుంచి రూ.2.6 లక్షల కోట్ల సంపదను విదేశీ మదుపర్లు వెనక్కి తీసుకున్నారు. 2025 మొత్తం ఏడాదిలో వెనక్కి తీసుకున్న (రూ.1.66 లక్షల కోట్లు) మొత్తంతో పోలిస్తే ఇది అధికం. జూన్ నెల ప్రారంభమైన తొలి మూడు రోజుల్లోనే రూ.34 వేల కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విదేశీ మదుపర్లు విక్రయించారు. దీంతో రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది. దీన్ని అరికట్టడంలో భాగంగా విదేశీ మదుపర్లను ఆకర్షించే చర్యలను చేపట్టింది. ఏప్రిల్ 1 దీర్ఘకాలిక లాభాల పన్ను మినహాయింపు వర్తిస్తుంది. ప్రస్తుతం ఏడాది దాటిన ఈక్విటీ, డెట్ పెట్టుబడులపై ప్రస్తుతం ఎఫ్‌ఐఐ లు 12.5 శాతం దీర్ఘకాల మూలధన లాభాల పన్నును చెల్లిస్తున్నారు. ప్రభుత్వ బాండ్లపై వచ్చే వడ్డీపై 20శాతం విత్‌హోల్డ్ సుంకాన్ని అదనం గా చెల్లిస్తున్నారు. ఈ మినహాయింపు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులతో (FII) పాటు, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్ మెంట్స్ (BIS)కూ వర్తిస్తుంది. మరోవైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా విదేశీ మదుపర్లను ఆకర్షించడంలో భాగంగా పలు చర్యలను ప్రకటించింది. విదేశీ పెట్టుబడిదారులు ఎటువంటి పరిమితులు లేకుండా 15, 30, 40 సంవత్సరాల ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడి పెట్టొచ్చని పేర్కొంది. జనరల్ రూట్‌లో ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడి పెట్టే విదేశీ పెట్టుబడిదారులకు ఉన్న (స్వల్పకాలిక, కాన్సంట్రేషన్, వ్యక్తిగత సెక్యూరిటీ) పరిమితులను తొలగించింది. ఎన్నారైలు, విదేశాల్లో నివసించే భారతీయులు లిస్టెడ్ ఈక్విటీల్లో పెట్టే పెట్టుబడి పరిమితిని పెంచింది. తద్వారా భారత ఈక్విటీ మార్కెట్‌ను విదేశాల్లో ఉంటున్నవారికి మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడాన్ని సులభతరం చేసింది.

## కుటుంబాల పొదుపు బాట..

అంతర్జాతీయంగా ఆర్థిక, భౌగోళిక అనిశ్చితులు పెరుగుతున్న నేపథ్యంలో దేశీయుల్లోనూ 'అప్రమత్తత' అధికమైంది. అవసరం కాని ఖర్చుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తూ, పొదుపునకు పెద్ద పీట వేస్తున్నారని అంతర్జాతీయ రీసెర్చ్ సంస్థ కాంటార్ సర్వే పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో చేసిన సర్వేతో పోలిస్తే.. మే నెలలో భారతీయుల ఆర్థిక భరోసా, భవిష్యత్తు అంచనాలపై ధీమా కొంత సడలినట్లు స్పష్టమైందని 'స్టేట్ ఆఫ్ ది నేషన్' సర్వేలో తెలిపింది. దేశంలోని మెట్రో, నాన్-మెట్రో నగరాల్లో 21-55 సంవత్సరాల వయసు గల 1684 మంది వినియోగదారుల నుంచి సమీకరించిన అభిప్రాయాలతో రూపొందించిన నివేదిక ప్రకారం.. 2026 లో భారత ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని 48% మందే భావిస్తున్నారు. జనవరి సర్వేలో వీరి సంఖ్య 60 శాతంగా నమోదైంది. ఉద్యోగాల లేఆఫ్స్‌పై ఆందోళన చెందుతున్న వారి సంఖ్య 36% నుంచి 41 శాతానికి పెరిగింది. 2025తో పోలిస్తే తమ పొదుపు, పెట్టుబడులు పెరుగుతాయని 39% మంది తెలిపా రు. మిగిలిన 61% మంది పొదుపు యథాతథంగా ఉంటుం దని లేదా తగ్గుతుం దని అంచనా వేస్తున్నారు. ఆరోగ్య సం రక్షణ ఖర్చుల (85%)పై అత్యధికులు ఆందోళన చెందుతున్నారు. జీవన వ్యయాలు పెరగడంపై 80% మంది, అద్దెలు-ఈఎంఐ చెల్లింపుల భారంపై 71% మంది ఆందోళన వ్యక్తం చేశారు. టీవీలు, కార్లు వంటి పెద్ద వస్తువులు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారి సంఖ్య 46% నుంచి 44 శాతానికి తగ్గింది.



# మూడోసారి ఆర్‌బీఐ వడ్డీ రేట్లలో మార్పుల్లేవ్

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ (RBI) గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం ఊరటనిచ్చే అంశం.అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నాం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు నిబంధనలను సరళీకరించాం. ఈక్విటీ మార్కెట్‌లో ఎన్‌ఆర్‌ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచాం.ఎక్స్ఛేంజ్ రేట్ పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. మన దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆర్థికంగా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా, అప్రమత్తంగా ఉంది.







## సూర్యపై వేటు!



టీ20 కెప్టెన్సీ నుంచి సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించడం ఖాయమని తెలుస్తోంది. కొత్త సారథిగా శ్రేయస్ అయ్యర్‌ను నియమించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. తిలక్ వర్మ కూడా రేసులో ఉన్నాడు. సూర్యను తప్పించే విషయంలో సెలక్టర్లు, కోచ్ గంభీర్‌ల అభిప్రాయం గురించి బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా.. బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌కు వివరించనున్నట్లు సమాచారం. "టీ20 కెప్టెన్‌గా సూర్యను తప్పించనున్నారు. ఐపీఎల్‌లోనైనా అతడు ఫామ్‌ను అందుకుంటాడేమోనని సెలక్టర్లు భావించారు. కానీ అతడు ఏమాత్రం ఫామ్‌లో లేడు. కఠిన నిర్ణయం తీసుకోక తప్పదు" అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. కెప్టెన్సీ కోల్పోతే.. సూర్యకు జట్టులో కూడా స్థానం దొరికే అవకాశం లేదు. ఏడాదిన్నర నుంచి బ్యాటర్‌గా అతడు పేలవ ఫామ్‌లో ఉన్నాడు. సూర్య ఇప్పటివరకు 113 టీ20ల్లో 36.35 సగటు, 162.94 స్ట్రైక్‌రేట్‌తో 3272 పరుగులు చేశాడు. కానీ 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు 35 మ్యాచ్‌ల్లో 26 సగటుతో 702 పరుగులు మాత్రమే సాధించాడు. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లో టీ20 సిరీస్‌లు ఆడే భారత జట్టును శనివారం ఎంపిక చేయనున్నారు.

# డబ్ల్యూటీసీ ఫైనల్ ఛాన్స్‌పై గంభీర్ ఆశాభావం..



ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (WTC 2025-27) నాలుగో సీజన్ కొనసాగుతోంది. ఫైనల్ రేసులో భారత్ చాలా వెనుకబడి ఉంది. ఇలాంటి సమయంలోనూ టీమ్ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం ఫైనల్‌కు చేరుకుంటామనే ఆశాభావం వ్యక్తం చేశాడు. అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టుకు ముందు గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నాడు. ఈ మ్యాచ్‌కు డబ్ల్యూటీసీకి సంబంధం లేదు. అయినా, రాబోయే సిరీస్‌లకు సన్నద్ధంగా వాడుకుంటామని గంభీర్ చెప్పాడు. ఈ క్రమంలో డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో మన అవకాశాలు ఎలా ఉన్నాయనేది ఇప్పుడు క్రికెట్ అభిమానులు చెక్ చేసుకుంటున్నారు. మరి మనమూ ఓ లుక్కేద్దాం.. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరాలంటే వచ్చే మార్చి నాటికి టాప్ -2లో ఉండాలి. ప్రస్తుతం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. దక్షిణాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్ కూడా మనకంటే ముందే ఉన్నాయి. టీమ్ఇండియా (48.15 శాతం) ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఈ సీజన్‌లో తొమ్మిది టెస్టులు ఆడిన భారత్ 4 మ్యాచుల్లో గెలిచి.. మరో నాలుగింట్లో ఓడింది. ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. భారత్ ఇంకా 9 టెస్టులను ఆడాల్సి ఉంది. శ్రీలంకతో రెండు, న్యూజిలాండ్‌తో రెండు, ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. ఒక్క మ్యాచులోనూ ఓడిపోకుండా.. కనీసం ఏడింట్లో గెలిచినా ఫైనల్‌కు చేరే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ఇప్పుడు పాయింట్ల పట్టికలోని టాప్ -2లో ఉన్న జట్లనే రాబోయే కాలంలో భారత్ ఢీకొట్టనుంది. ఆ టీమ్‌లపై సిరీస్‌లను క్లీన్‌స్వీప్ చేస్తే తిరుగుండదు. అయితే, టీమ్ఇండియాకు ఇది కఠిన సవాలే. ఎందుకంటే అందులో నాలుగు టెస్టులు విదేశీ గడ్డపైనే ఆడాల్సి ఉంది. శ్రీలంక, కివీస్‌తో వారి స్వదేశంలో తలపడనుంది.


## నార్వే చెస్ టైటిల్ రేసులోకి ప్రజ్ఞానంద



నార్వే చెస్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద దూకుడు ప్రదర్శిస్తున్నాడు. హ్యాట్రిక్ విజయాలతో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో హేమాహేమీ ప్లేయర్లను మట్టికరిపించాడు. తాజాగా గుకేశ్‌ను ఓడించిన ప్రజ్ఞానంద.. అంతకుముందు మాగ్నస్ కార్ల్‌సన్‌పై విజయం సాధించాడు. దీంతో 9వ రౌండ్ ముగిసేసరికి ప్రజ్ఞానంద 15 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకాడు. అతడి కంటే ముందున్న వెస్లీ సో (15.5 పాయింట్లు) కేవలం అర్ధ పాయింట్ ఎక్కువ ఉండటం గమనార్హం. చివరి రౌండ్‌లో వెస్లీ ఓడి.. ప్రజ్ఞానంద గెలిస్తే టైటిల్‌ను అందుకొనేందుకు అవకాశాలు ఉన్నాయి. ఇవాళ చివరి రౌండ్‌లో విన్సెట్‌తో ప్రజ్ఞానంద.. అలిరెజాతో వెస్లీ తలపడనున్నారు. నార్వే చెస్ మహిళల విభాగంలో భారత్ నుంచి ఎవరూ టైటిల్ రేసులో నిలవలేదు. దివ్య దేశ్‌ముఖ్ ఐదో స్థానం, కోనేరు హంపి 6వ స్థానంలో నిలిచారు. కజికిస్థాన్‌కు చెందిన బిబిసారా అస్సాబయేవా అగ్రస్థానంలో ఉంది. ఆమె ఖాతాలో ఇప్పటికే 16.5 పాయింట్లు ఉన్నాయి. తర్వాత జు జినెర్ (13) ఉన్నప్పటికీ.. పాయింట్ల మధ్య అంతరం చాలా ఉంది. దీంతో చివరి రౌండ్ ఫలితంతో సంబంధం లేకుండానే బిబిసారా టైటిల్‌ను నెగ్గినట్లే.

## తుది జట్టు ఎంపికలో మా యాజమాన్యం జోక్యం: లివింగ్ స్టోన్

ఐపీఎల్‌లో నైపుణ్యం లేదు.. బోర్ కొడుతోందంటూ రెండు రోజుల కిందట సంచలన వ్యాఖ్యలు చేశాడు ఇంగ్లాండ్ క్రికెటర్ లియాన్ లివింగ్ స్టోన్. తాజాగా మరోసారి ఐపీఎల్ ప్రస్తావన తీసుకొచ్చాడు. అయితే, ఇప్పుడు తన జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యాజమాన్యాన్ని ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ సీజన్‌లో అతడు కేవలం రెండే మ్యాచుల్లోనే కనిపించాడు. దీంతో తమ తుది జట్టు ఎంపికలో యాజమాన్యం జోక్యం ఉందని లివింగ్‌స్టోన్ వ్యాఖ్యానించాడు. కేవలం ముగ్గురే విదేశీ క్రికెటర్లను ఆడించిన ఫ్రాంచైజీ.. తనకు అవకాశాలు మాత్రం ఇవ్వలేదని పేర్కొన్నాడు. 'ఐపీఎల్‌లో మూడు రకాల పద్ధతులు ఉన్నాయని అనుకుంటున్నా. అందులో ఒకటి.. మీరు జట్టులో స్థిరపడిపోతారు. మీకోసం అంతా సిద్ధంగా ఉంటుంది. ఇక రెండోది.. మీకు ఆడే అవకాశం రావచ్చు లేదా రాకపోవచ్చు. అది సందిగ్ధత. అప్పుడు మీ ఆలోచనలు 'ఒకవేళ నేను ఆడితే.. ఇలా జరగబోతోంది' అనేవిధంగా ఉంటాయి. నా విషయంలోనూ ఇలాగే జరిగింది. సన్‌రైజర్స్‌కు వెళ్లినప్పుడు.. వేలంలో ముంబయి ఇండియన్స్ కోరుకున్న ఓ ఆటగాడి కోసం మా జట్టు పోటీపడింది. మా దగ్గర ఎక్కువ సొమ్ము ఉండటంతో అతడిని తీసుకోగలిగాం. యజమాన్యానికి బాగా నచ్చాడు. అతడు తుది జట్టులోనూ ఆడటం ఖాయమైంది. అలాగే ఆడాడు. ప్యాట్ కమిన్స్ కొన్ని మ్యాచులకు అందుబాటులో లేడు. ఆ సమయంలోనూ మేం కేవలం ముగ్గురు విదేశీ క్రికెటర్లతోనే బరిలోకి దిగాం. ఇదే విషయాన్ని మా కోచ్ డానియల్ వెటోరీని అడిగా. "ఓనర్లకు ఆ కుర్రాడు బాగా నచ్చాడు. అతడి కోసం ప్లేస్ కేటాయించాలి. కమిన్స్ వచ్చినా సరే.. తుది జట్టులో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో నేను ఎక్కువ మ్యాచులు ఆడటం లేదని అర్థమైపోయింది.



## సూర్యను తప్పిస్తే.. అవి తప్పుడు సంకేతాలే ..: ఎమ్మెస్కే ప్రసాద్

సూర్యకుమార్‌యాదవ్‌ను కెప్టెన్సీ నుంచి తప్పిస్తారనే వార్తలు వస్తున్నాయి. తన నాయకత్వంతో టీమ్ఇండియాకు వరల్డ్ కప్ అందించినప్పటికీ.. బ్యాటర్‌గా ఘోరమైన ప్రదర్శన చేయడమే అందుక్కారణమని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. రాబోయే టీ20 ప్రపంచ కప్ నాటికి కొత్తవారిని సిద్ధం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకొనేందుకు బీసీసీఐ సెలక్షన్ కమిటీ మొగ్గు చూపిస్తోందని పలువురి విశ్లేషణ. జూన్ 6న సెలక్టర్లు ప్రకటన చేయనున్నారు. ఈ క్రమంలో మాజీ చీఫ్ సెలక్టర్, మాజీ క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇంగ్లాండ్ పర్యటనకు ఫస్ట్ టీమ్‌ను పంపిస్తారా? ద్వితీయ శ్రేణిని పంపిస్తారా? ఇప్పుడిదే కీలకం. ఒకవేళ మీరు అత్యుత్తమ టీమ్‌నే పంపిద్దామనుకుంటే మాత్రం సూర్యకుమార్ యాదవ్‌ను సారథ్యం నుంచి తప్పించడం సరికాదు. అతడు టీమ్ఇండియాకు వరల్డ్ కప్ అందించిన కెప్టెన్. రాబోయే ఐదారు నెలల్లో కొత్త సారథిని సిద్ధం చేసుకోవాలని అనుకుంటే.. ముందు సూర్యకుమార్‌ను డిప్యూటీగా నియమించండి. మొన్న టీ20 ప్రపంచ కప్ విజయం వరకూ అక్షర్ పటేల్‌ను వైస్ కెప్టెన్‌గా ఉంచారు. ఇప్పుడు సారథి రేసులోకి ఇంకొందరు వచ్చారు. యువ నాయకులను గుర్తించి సూర్యకు డిప్యూటీగా నియమిస్తే బాగుంటుంది. సూర్య అద్భుతమైన ఆటగాడు. బ్యాటర్‌గా గత ఏడాదిన్నర కాలంలో చాలా ఒడిదొడుకులు ఎదుర్కొన్నాడని తెలుసు. కొత్త కుర్రాళ్లు తమ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. రజత్ పాటీదార్ ఉన్నాడు. అలాగని ఇలాంటి సమయంలో సూర్యను కెప్టెన్సీ నుంచి తప్పించడం సరికాదనేది నా భావన. ఈ రెండు సిరీసుల్లో అవకాశం ఇవ్వండి. అప్పుడు కూడా అతడి ఆటతీరు బాగోలేకపోతే.. డిప్యూటీగా నియమించే వారికి జట్టు పగ్గాలు అప్పగించొచ్చు" అని ఎమ్మెస్కే అన్నారు.





"ఇప్పుడు భారత జట్టులో ప్రతిభకు కొదవలేదు. సారథి రేసులోనూ చాలామంది ఉన్నారు. సంజు శాంసన్, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్.. శ్రేయస్ అయ్యర్ సమర్థుడు. సంజుశాంసన్‌కు రాజస్థాన్ రాయల్స్‌ను నడిపించిన అనుభవం ఉంది. తిలక్ దేశవాళీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇక రజత్ పాటీదార్ కూడా మంచి ఛాయిస్. ఆర్సీబీకి రెండు కప్పులు అందించిన సారథి. వరల్డ్ కప్, ఐపీఎల్‌లో ఆడిన ప్లేయర్లకు కాస్త బ్రేక్ ఇస్తే బాగుంటుంది. కొత్త వారికి అవకాశాలు ఇచ్చేందుకు వీలు కలుగుతుంది. అప్పుడు శ్రేయస్ లేదా ఇతర ప్లేయర్‌కు కెప్టెన్సీ అప్పగించే అవకాశం ఉంది. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్, సంజు, రజత్ పాటీదార్ వంటి ప్లేయర్లను ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు ఎంపిక చేస్తే బాగుంటుంది" అని విశ్లేషించారు.

# వుదయం సినిమా
MOVIE TIME!



**వుదయం సినిమా** ప్రస్తుతం సోషల్‌మీడియాలో ఒకటే హాట్‌టాపిక్. ఐమ్యాక్స్. దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ ఐమ్యాక్స్ మూవీ అనుభూతిని తెలుగు ప్రేక్షకులు పొందే అవకాశం త్వరలో రానుంది. హైదరాబాద్‌లో 'సుదర్శన్ 70'లో 'ఏఎంబీ క్లాసిక్ విక్టరీ' పేరుతో ఐమ్యాక్స్ స్క్రీన్ ఏర్పాటు కానుంది.

## ఐమ్యాక్స్ స్క్రీన్ Vs నార్మల్ స్క్రీన్.. ఈ ఒక్క వీడియో చూస్తే చాలు

అ మా పోరాటాన్ని అపహాస్యం చేసినట్టుగా అనిపిస్తోంది. అందుకే మేం ఈ చట్టం గురించి స్పష్టంగా చెప్పేందుకు మీడియా ముందుకు వచ్చామని ఆమె అన్నారు. ఇప్పుడు ఇది విక్టిమ్ ప్రొటెక్షన్ ప్లాన్, పార్లమెంట్ ఆమోదించిన తరువాత చట్టంగా మారుతుంది. ఇందులో మూడు విషయాలు క్లియర్‌గా ఉంటాయి. ఆర్టికల్ 21, 23 ప్రకారం.. ప్రతీ ఒక్క బాధితురాలికి రిహాబిలిటేషన్ అనేది ప్రాథమిక హక్కు. బాధితురాలికి డిగ్నిటీ ఉండటం. అమ్మాయిని సరుకులా అమ్మకూడదు, గౌరవప్రదంగా, అర్థవంతంగా బతికేలా వనరులు కల్పించడం అనే అంశాలు ముఖ్యంగా ఉంటాయి. ప్రతీ దశలో అంటే పునరావాసం కావాలా? రిహాబిలిటేషన్ సెంటర్‌కి రావడం అంగీకారమేనా? ఇలా ప్రతీ సారి అమ్మాయి కన్సంట్ తీసుకోవాలి.

# 'దూత 2' కింగ్ నాగార్జున క్లాప్‌తో ప్రారంభం

**వుదయం:** యువ సామ్రాట్ నాగచైతన్య అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన సూపర్‌నేచురల్ థ్రిల్లర్ 'దూత'తో ఓటీటీలో సంచలన అరంగేట్రం చేశారు. 'దూత' ప్రపంచవ్యాప్తంగా సంచలన విజయాన్ని సాధించింది. ఈ సూపర్‌నేచురల్ థ్రిల్లర్ పలు అంతర్జాతీయ మార్కెట్లలో ప్రేక్షకులను ఆకట్టుకుని గ్లోబల్ ఫెనామెనాన్‌గా నిలిచింది.తొలి సీజన్ నాగచైతన్యకు డిజిటల్ ప్రేక్షకుల్లో మరింత గుర్తింపును తీసుకురావడమే కాకుండా, నటుడిగా ఆయనలోని మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. ఇప్పుడు ఈ ఫ్రాంచైజీతో తన అనుబంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ, నాగచైతన్య సీక్వెల్ కోసం నిర్మాతగానూ మారుతున్నారు. శరత్ మరార్‌తో కలిసి అన్నపూర్ణ స్టూడియోస్, నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై నిర్మిస్తున్నార.మొదటి సీజన్‌కు ప్రధాన బలంగా నిలిచిన తన అద్భుత కథన శైలితో విక్రమ్ కె కుమార్ రెండో సీజన్‌కు దర్శకత్వం వహించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను నేడు సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కింగ్ నాగార్జున అక్కినేని క్లాప్ కొట్టి, స్క్రిప్ట్‌ను చిత్రబృందానికి అందజేశారు.





# 26న 'మనోడు వస్తున్నాడు' రిలీజ్

**వుదయం:** మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'లెనిన్'. అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రలలో నటించిన ఈ మూవీకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ చిత్రం జూన్ 26న థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది.ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, పాటలు ప్రేక్షకుల్లో అంచనాలు మరింతగా పెంచేశాయి. ఇటీవల మేకర్స్ 'సోల్ ఆఫ్ లెనిన్' అంటూ ఆడియెన్స్‌ని సర్ ప్రైజ్ చేశారు. 'పెద్ది' సినిమా ప్రస్తుతం థియేటర్లో సందడి చేస్తోంది. 'పెద్ది' ప్రదర్శనలకు ఈ 'సోల్ ఆఫ్ లెనిన్'ను జోడించారు. ఈ ఉద్వేగభరితమైన, పవర్ ఫుల్ పాటకు బ్లాక్‌బస్టర్ స్పందన లభించింది. సినీ లవర్స్ ఈ పాట, అందులోని క్లిప్స్‌ను ఆన్‌లైన్‌లో షేర్ చేస్తూ అద్భుతంగా ఉందని కామెంట్లు పెడుతున్నారు.ఈ పాటలో అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే మధ్య ఉండే ప్రేమ, వారి బాండింగ్‌ను చక్కగా చూపించారు. 'ప్రేమ కంటే గొప్ప యుద్ధం లేదు' అనే క్యాప్షన్‌తో ఈ పాట సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. ప్రేమ కోసం అఖిల్ చేసే పోరాటం, భాగ్యశ్రీ ఆకట్టుకునే నటన ఈ పాటకు మరింత అదనపు ఆకర్షణను జోడించాయి. థమన్ స్వరపరిచిన ఈ పాట ప్రేక్షకులను కట్టిపడేస్తోంది.



# ఎమ్మెల్యే నవీన్ యాదవ్ చేతుల మీదుగా నూతన చిత్రం 'మొహబ్బత్' ప్రారంభం




**వుదయం:** సంతోష్ కల్వచెర్ల, శ్రేయాసి సేన్ జంటగా ఏబీఎస్ ప్రొడక్షన్ బ్యానర్ మీద అఫ్రోజ్ షేక్ నిర్మిస్తున్న నూతన చిత్రం 'మొహబ్బత్'. ఈ చిత్రానికి స్క్రీన్ ప్లేని అందిస్తూ మ్యాక్ దర్శకత్వం వహించనున్నారు. ఈ మూవీ ప్రారంభోత్సవం శుక్రవారం నాడు ఘనంగా జరిగింది. ఈ చిత్ర పూజా కార్యక్రమాలకు చిన్న శ్రీశైలం యాదవ్ గారు, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి నవీన్ యాదవ్ గారు క్లాప్ కొట్టగా చిత్ర నిర్మాత అఫ్రోజ్ షేక్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. అనంతరం నవీన్ యాదవ్ గారు చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్‌ని కూడా లాంచ్ చేశారు. చిత్రయూనిట్ నిర్వహించిన మీడియా సమావేశంలో..ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ .. "మొహబ్బత్' సినిమా ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నన్ను పిలిచినందుకు ధన్యవాదాలు. అఫ్రోజ్ అన్న నిర్మాతగా కొత్త వారికి ప్రోత్సాహం అందిస్తున్నారు. సినీ కార్మికుల కష్టాలు నాకు తెలుసు. ఎన్ని కష్టాలు వచ్చినా సినిమాల్ని నిర్మిస్తూనే ఉంటారు. ఈ చిత్రానికి పని చేస్తున్న ప్రతీ ఒక్కరికీ ఆల్ ది బెస్ట్. ఇది పాన్ ఇండియాగా రిలీజ్ కాబోతోంది. దర్శకుడు మ్యాక్‌కి మంచి సక్సెస్ రావాలి. ఈ సినిమా మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.దర్శకుడు సలీమ్ మాలిక్ (మ్యాక్) మాట్లాడుతూ .. 'నిర్మాత అఫ్రోజ్ గారు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా 'మొహబ్బత్'ను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. నాకు ఈ జర్నీలో సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఎమోషనల్ యూత్ ఫుల్ జెన్ జీ చిత్రంగా 'మొహబ్బత్' రానుంది.

# 'ఓ అందాల రాక్షసి' మూవీ హీరో, మూవీ మేకర్ షెరాజ్ మెహదీ ఆవేదన

**వుదయం:** తెలుగు సినిమా పరిశ్రమలో మాఫియా చిన్న సినిమాలను చంపేస్తోందని 'ఓ అందాల రాక్షసి' హీరో, మూవీ మేకర్ షెరాజ్ మెహదీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రిలీజ్ కే కాదు, రీ-రిలీజ్‌కు కూడా థియేటర్లు ఇవ్వలేదని ఇవ్వడం లేదని, థియేటర్స్ ఇవ్వకపోతే ఆత్మహత్య శరణ్యం అన్నారు. తెలుగు ఫిలిం చాంబర్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ, "మంచి సినిమాలను కిల్ చేస్తున్నారు. చిన్న సినిమాలను చంపేస్తున్నారు. నైజాం ఏరియాలో ఒక్క థియేటర్ కూడా ఇవ్వలేదు. ఇది వ్యూహాత్మకంగా జరుగుతోంది" అని షెరాజ్ మెహదీ అన్నారు. ఈ విషయంపై లీగల్‌గా పోరాటం కొనసాగుతోందని తెలిపారు.చిన్న సినిమాల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని, "ప్రపంచంలో ఎక్కడా లేని పరిస్థితి మన ఇండస్ట్రీలో ఉంది. బాలీవుడ్‌లో కూడా ఇలా ఉండదు" అని వ్యాఖ్యానించారు. సెన్సార్ బోర్డు నిబంధనలు చిన్న సినిమాలకు భారంగా మారుతున్నాయని, ADCC వంటి చార్జీలు కూడా నిర్మాతలను కుంగదీస్తున్నాయని తెలిపారు.



# 'స్లమ్ డాగ్' టీజర్ 8న రిలీజ్



**వుదయం:** డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్-డ్రామా 'స్లమ్ డాగ్' ఈ చిత్రం ప్రొడక్షన్ విజయవంతంగా పూర్తయింది. అన్ని భాషా వెర్షన్లలో పోస్ట్-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. '33 టెంపుల్ రోడ్' అనే ఆసక్తికరమైన ట్యాగ్ లైన్‌తో ఈ ప్రాజెక్ట్ దాని టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్-లుక్ విడుదల నుండి హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. 'స్లమ్ డాగ్' చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్, జె.బి. నారాయణరావు కొండ్రోల్లా జె.బి. మోషన్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మించారు. నిర్మాతలు ఇప్పుడు నెక్స్ట్ ఫేజ్ ప్రమోషన్ల కోసం సిద్ధమవుతున్నారు.ఈ చిత్రం టీజర్‌ను జూన్ 8న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. టీజర్ పోస్టర్‌లో కనిపించిన విజువల్ ఎంతో డార్క్ అండ్ ఇంటెన్స్‌గా ఆకట్టుకుంటోంది. కళ్లకు గంతలు కట్టుకున్న ఓ వ్యక్తి మెడపై రక్తంతో తడిసిన కట్టి ఉంచిన దృశ్యం కథ లోని బ్రూటల్ ప్రపంచాన్ని సూచించేలా కనిపిస్తోంది.

# విక్టిమ్ ప్రొటెక్షన్ ప్లాన్‌ను వివరించిన సునీతా కృష్ణన్



**వుదయం:** మహిళల అక్రమ రవాణా మీద, మహిళలను వ్యభిచార కూపంలోంచి బయటకు తీసుకు వచ్చేందుకు ప్రజ్వల సంస్థ పోరాడుతూ వస్తోంది. ఈ మేరకు ప్రజ్వల సంస్థ ఫౌండర్, పద్మశ్రీ గ్రహీత సునీతా కృష్ణన్ తాజాగా మీడియా ముందుకు వచ్చి 'విక్టిమ్ ప్రొటెక్షన్ ప్రోటోకాల్ చట్టం' గురించి వివరించారు. అంతే కాకుండా తమ సంస్థ ద్వారా చేసిన పోరాటం, ఉద్యమం గురించి కూడా వివరించారు. సునీతా కృష్ణన్ ఇంకా మాట్లాడుతూ.. 'మేం ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటి వరకు 32, 400 మంది అమ్మాయిలని రెస్క్యూ చేశాం. అయితే వీరిలో చాలా మంది ఈ సమాజం, పోలీసులు, ఇతర వ్యవస్థల ద్వారా మరింతగా బాధ పడుతూనే ఉన్నారు. ఇక్కడి బాధల్ని భరించలేక మళ్లీ తిరిగి ఆ అంధకారంలోకి వెళ్లారు. విక్టిమ్ ప్రొటెక్షన్ ప్రోటోకాల్ అనే చట్టం రావాలని మేం పోరాడం.

# పెద్ది రామ్ చరణ్ కెరీర్ బెస్ట్

**వుదయం:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది'. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లతో సంచలన విజయాన్ని సాధించింది. అన్ని ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో విజయవంతంగా ప్రదర్శితమౌతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం 'బాక్సాఫీస్ ఛాంపియన్' సక్సెస్ ప్రెస్ మీట్‌ను నిర్వహించింది.పెద్ది బాక్సాఫీస్ ఛాంపియన్ ప్రెస్ మీట్ లో నిర్మాత వెంకట సతీష్ కిలారు మాట్లాడుతూ: ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. 'పెద్ది' చిత్రం అద్భుతంగా దూసుకుపోతోంది. తొలి రోజే ₹135 కోట్లకు పైగా వసూలు చేసింది. ప్రేక్షకుల నుంచి, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి వస్తున్న స్పందన చాలా అద్భుతంగా ఉంది.



సినిమా చూసిన వారందరూ ఇది చాలా మంచి సినిమా అని అభినందిస్తున్నారు. ఇది నిజంగా బ్రహ్మాండమైన సినిమా. అందరూ తమ పిల్లలను తీసుకుని థియేటర్లలో సినిమా చూడండి. ఇది రామ్ చరణ్ గారి కెరీర్‌లో బెస్ట్ సినిమా. ఆ స్థాయిలో ఓపెనింగ్స్ వచ్చాయి. టికెట్ రేట్ల విషయంలో మాకు సహకరించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు ప్రత్యేక ధన్యవాదాలు. భారీ స్థాయిలో, అత్యంత గ్రాండ్‌గా ఈ సినిమాను నిర్మించాం. ఆ కృషికి ప్రభుత్వాలు ఎంతో సానుకూలంగా స్పందించాయి. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి, మంత్రి కందుల దుర్గేష్ గారికి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారికి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారికి మరోసారి కృతజ్ఞతలు. చాలా కీలక సమయం లో వారు మాకు అండగా నిలిచారు. ఈ సినిమాను ప్రేక్షకులు చాలా దూరం తీసుకెళ్లారు. అందరూ సినిమాను నమ్మి అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలబెట్టారు. మీడియా కి ధన్యవాదాలు. ఒక మంచి సినిమాకు మీరందరూ అండగా నిలిచారు. సినిమా గురించి అందరూ చాలా బాగా రాశారు.

# 'సింగ్ గీతం' ఖచ్చితంగా ఆడియన్స్‌కు ఒక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది: రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్

**వుదయం:** లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ 'సింగ్ గీతం' తో ముందుకు వస్తున్నారు. ప్రతిష్టాత్మక బ్యానర్లు వైజయంతి మూవీస్, స్వప్న సినిమా పై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. ఇప్పటికే విడుదలైన 'సింగ్ గీతం' టీజర్, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. 'సింగ్ గీతం' జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ విలేకర్ల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.సింగీతం శ్రీనివాసరావు గారితో సినిమా అనగానే మీ ఫీలింగ్ ఏంటి?-నేను సింగీతం గారికి వీరాభిమానిని. ఆయన లెజెండ్. నాన్న గారిని కలవడానికి వచ్చేటప్పుడు వాళ్లు మాట్లాడుకుంటుంటే నేను ఆరాధనగా చూసేవాడిని. చాలా ఏళ్ల క్రితం పవన్ కళ్యాణ్ గారితో జీసస్‌పై ఒక సినిమా అనుకున్నాం. కానీ కొన్ని కారణాల వల్ల అది జరగలేదు. ఆ సమయంలో సింగీతం గారు మా స్టూడియోకు వచ్చి 'సింగ్ గీతం' ఐడియా చెప్పారు. అది వినగానే నాకు చాలా థ్రిల్‌గా అనిపించింది. ఎప్పుడైనా ఆ సినిమా చేయాలని అనిపించింది.-సింగీతం గారు చేసిన ప్రయోగాలు మరెవ్వరూ చేసి ఉండరు. పుష్పక విమానం, భైరవద్వీపం, ఆదిత్య 369 వంటి చిత్రాలు నాకు చాలా ఇష్టం. మూడేళ్ల క్రితం ఈ ప్రాజెక్ట్ చేస్తున్నామని ఆయన నుంచి ఫోన్ వచ్చింది. అప్పుడు నాకు చాలా ఆనందంగా అనిపించింది. తర్వాత ఏడాది క్రితం నాగ్ అశ్విన్ గారు, స్వప్న గారు, వైజయంతి మూవీస్‌తో కలిసి ఈ సినిమా రూపొందుతుండటం మరింత ఆనందాన్ని ఇచ్చింది.-ఈ సినిమాను నేను చాలా అదృష్టంగా భావిస్తున్నాను. సింగీతం గారికి ఒక ట్రిబ్యూట్‌లా, ఆయనతో కలిసి పనిచేయడం ఒక బ్లెస్సింగ్‌లా అనిపించింది. ఈ ఆనందాన్ని మాటల్లో చెప్పలేను.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.